

అధికార గర్వంతో అరెస్టుల పర్వం

నవతెలంగాణ-రాయపర్తి

కాంగ్రెస్ పార్టీ నేతలు అధికార గర్వంతో అరెస్టుల పర్వానికి దిగుతున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నరసింహనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలారం దుర్గమ్మ తల్లి ఉత్సవాల్లో ర్యాలీగా వెళుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుల పట్ల కాంగ్రెస్ నాయకులు దురుసుగా ప్రవర్తిస్తూ పక్కకు వెళ్ళండి అంటూ దాడికి దిగినట్లు వివరించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న దుర్గమ్మ తల్లి ఉత్సవంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారదర్పంతో విచ్చలవిడిగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నేతలు రౌడీ రాజకీయాలను ఆపాలని హితవుపలికారు. ఈ సమావేశంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



కూసం రాంచందర్‌కు సన్మానం

నవతెలంగాణ-పర్వతగిరి

కాంగ్రెస్ పార్టీ పర్వతగిరిటౌన్ అధ్యక్షుడు కూసం రామచందర్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రాంచందర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు బానోత్ భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మాసాని సువర్ణ, చింత నెక్కొండ గ్రామ పార్టీ అధ్యక్షులు ఓరుగంటి శ్రీనివాస్, నాయకులు లచ్చునాయక్, మాజీ ఎంపీటీసీ మహమ్మదలి, నరెడ్ల సంతోష్, వంగ సాయికృష్ణ, కొమ్ము రమేష్, బొట్ల వెంకన్న పాల్గొన్నారు.



నూతన వధూవరులకు ఆశీర్వాదం

నవతెలంగాణ-చెన్నారావుపేట

మండల కేంద్రానికి చెందిన చింతకాయల లక్ష్మీనారాయణ-సరోజన దంపతుల కుమారుడు వినయ్-స్నేహ వివాహానికి ఆదివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ, మాజీ మార్కెట్ చైర్మన్, క్లస్టర్ బాధ్యులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన అగ్రవర్ణ పాలకులు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కార్పొరేట్ విద్యావ్యవస్థను ప్రోత్సహిస్తున్న సుందర్ రాజ్‌యాదవ్‌ను ఓడించాలని తెలంగాణ బీసీ, ఎస్సి, ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదివారం హన్మకొండలోని ఆదర్శ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్, ఖమ్మం,నల్గొండ నియోజకవర్గం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ధర్మ టీచర్స్ యూనిట్ తరపున పోటీ చేస్తున్న దళిత బిడ్డ, రిటైర్డ్ టీచర్ దామెర బాబురావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణలో గత అగ్రవర్ణ పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యారంగం భ్రష్టు పట్టిందని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎక్కువ శాతం అగ్రవర్ణాలకు చెందిన వారు పోటీ చేస్తున్నారని, నేటి వరకు పెద్దల సభలో ఎమ్మెల్సీగా వారే ఎన్నికవుతూ సొంత ఎజెండా ఏర్పాటు చేసుకుని లక్షలాది ఆస్తులు కూడగట్టుకున్నారని ఆరోపించారు. సమావేశంలో ధర్మ టీచర్స్ యూనిట్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, నాయకులు రాజు నాగరాణి నాగయ్య, కుమార్, సంజీవ్,సుమన్, సునీల్ రవీందర్, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో విజేతలుగా సెయింట్ థెరిస్సా విద్యార్థులు

నవతెలంగాణ-ఆత్మకూర్

శ్రీ శ్రీనివాస రామానుజన్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఆత్మకూరు మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ లిస్మేరీ, ప్రిన్సిపల్ జాయిస్ అన్నారు. ఆది వారం హనుమ కొండలో ఎస్ఆర్ఎఫ్ 1929కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, కేయూ రిజిస్ట్రార్ రామచందర్ , ఏసీపీ ప్రదీప్‌రెడ్డి హాజరయ్యారు. వీరి



చేతుల మీదుగా సెయింట్ థెరిస్సా పాఠశాల విద్యార్థులు, 8వ తరగతి చిట్టి బొమ్మల నిక్షిత స్టేట్ టాపర్‌గా, పదవ తరగతి కిటిడి నితిన్‌రెడ్డి జిల్లా టాపర్‌గా మోతె కీర్తన, బూర చంద్ర, పరిపాటి హర్షిత్‌రెడ్డి, వల్లెపు అక్షర, ఇండ్ల అశ్వద్వర్మ జిల్లా కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్, కరెస్పాండెంట్, ఉపాధ్యాయులు విజేతలుగా నిలిచి బహుమతులు పొందిన విద్యార్థులను అభినందించారు.

అరూరి రమేష్‌కు కేంద్ర మంత్రి పరామర్శ

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తల్లి వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా ఆదివారం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం కిషన్‌రెడ్డి అరూరి రమేష్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వరంగల్ అర్బన్ కో-అపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందం రెడ్డి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మాజీ



ఎమ్మెల్యే ధర్మారావు, హన్మకొండ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు సంతోష్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్నా ప్రభాకర్, కాజీపేట దర్గా పిఏసిఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, సిఏ రాజు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పన్నులు చెల్లించి నగర అభివద్ధికి సహకరించాలి

బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే

నవతెలంగాణ-వరంగల్

పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖడే అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లో గల మెడికోవర్ యాజమాన్యానికి జిడబ్ల్యూఎంసీ విధించిన డివియేషన్ పెనాల్టీ, జరిమానా ఆస్తిపన్ను మొత్తం రూ.7లక్షల23వేల289 చెక్‌ను ఆదివారం ఖాజీపేట సర్కిల్ కార్యాలయంలో కమిషనర్‌కు వారు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బల్దియావ్యాప్తంగా విద్యాసంస్థలు, హాస్పిటల్‌లు వ్యాపార, వాణిజ్య సంస్థలు, గృహాలు ఆస్తి పన్నులు విధిగా సకాలంలో చెల్లించి నగర



ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, రెవెన్యూ అధికారి యూసుఫోద్దిన్, సూపరింటెండెంట్ అనిల్, ఆర్ఐలు దేవరాజ్, రజని, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వేళల్లో ప్రచారం జోరు !

- పాఠశాలల్లో జోరందుకున్న సోషల్ మీడియా ప్రచారం
- బోధన గోరంత ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కొండంత
- తరగతి గదుల్లో విచ్చలవిడిగా సెల్‌ఫోన్ వినియోగం
- విద్యాశాఖ ఆదేశాలను భేఖాతార్
- నిద్రావస్థలో విద్యాశాఖ ఉన్నతాధికారులు

నవతెలంగాణ-రాయపర్తి

ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలు.. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులు.. తరగతి గదిలో జ్ఞాన దీవిటి వెలుగులు.. అని ఉపాధ్యాయ వత్తి గురించి చెప్పుకునే గొప్పతనం కొంతమంది ఉపాధ్యాయుల తీరుతో మసకబారుతుంది. క్రమ శిక్షణకు మారుపేరుగా నిలిచే ఉపాధ్యాయులు 'ఉపాధ్యాయ ఎమ్మెల్సీ' ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. విద్యార్థులకు పాఠాలు చెప్పే సమయంలో సోషల్ మీడియాలో జోరు ప్రచారం చేస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27న ఉన్నందున సదరు ఉపాధ్యాయులు తన అభిమాన అభ్యర్థి గెలుపు కోసం పని వేళల్లో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ తమ అభిమానాన్ని చూపెడుతున్నారు. పోలీస్ తేదీ సమీపిస్తుండడంతో ఉపాధ్యాయ సంఘాల లీడర్లు కొందరు తమ పరిధిని దాటి గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సంచరిస్తూ తమ అభ్యర్థి గెలుపు కోసం వేయప్రయాసాలు పడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో సెల్ ఫోన్లు చేతబట్టి తమ ప్రచార నైపుణ్యాన్ని చూపెడుతున్నారు అని కొందరు ఉపాధ్యాయులే



చర్చించుకోవడం జరుగుతుంది . వాట్సాప్ గ్రూపుల్లో,ఫేస్ బుక్కు, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా వేదికలో తమ అభ్యర్థి గొప్పదనాన్ని ప్రచారం చేస్తూ ఉపాధ్యాయుడికి ఉన్న గొప్పతనాన్ని మంటగలుపుతున్నారు అని విద్యా సంఘాల నాయకులు అంటున్నారు.

తరగతి గదిలోకి సెల్ ఫోన్ నిషేధం..

విజ్ఞాన భాండగారాలైన తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్ ఫోన్ లను ఉపయోగించడం వలన విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని గమ నించిన రాష్ట్ర విద్యాశాఖ క్లాస్ రూముల్లో సెల్‌ఫోన్లు వాడొద్దని 2013లోనే స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి 2014, 2020 సంవత్సరంలో మరింత పకడ్బందీగా ఆదేశాలు జారీ చేసి స్పష్టత ఇచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత అలాగే కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో సెల్ ఫోన్లు ఉపయోగించరాదని హుకుం జారీ చేసింది. ప్రతి ఉపాధ్యాయుడు తన సెల్‌ఫోన్‌ను ఆయా విద్యాసంస్థల హెడ్ మాస్టర్లు, ప్రిన్సిపాల్ వద్ద ఉంచి తరగతి గదులకు వెళ్లాలని, అధికారికంగా ఏమైనా మాట్లాడాల్సి వస్తే సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని వినియోగించాలన్న నిబంధన ఉంది. ఇలా ఉన్నప్పటికీ సదరు ఉపాధ్యాయులు విద్యాశాఖ నిబంధనలను బేఖాతార్ చేస్తూ క్లాస్‌రూమ్‌లో విచ్చలవిడిగా సెల్‌ఫోన్లను వినియోగిస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ రాజకీయ పార్టీల సోషల్ మీడియా ఇంచార్జిలనే తలదన్నేలా ప్రచారం చేయడం జరుగుతుందని విద్యా సంఘాల నేతలు తెలుపుతున్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల సెల్‌ఫోన్ వినియోగంపై రాయపర్తి మండల విద్యాశాఖ అధికారి నోముల రంగయ్యను చరవాణిలో వివరణ కోరగా స్పందించకపోవడం కొసమేరుపు.

టీచర్లు నిబంధనలను అతిక్రమించడం సరికాదు



విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులే ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి తరగతి గదుల్లో సెల్ ఫోన్స్ వాడడం సరికాదు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ కొందరు ఉపాధ్యాయులు రాజకీయ నాయకులను తలపించే విధంగా పని వేళల్లో ప్రచారం చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్న.. విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలను అతిక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

యార ప్రశాంత్ (ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా కార్యదర్శి)

తరగతి గదిలో సెల్ ఫోన్స్ వాడడం నిషేధం



పాఠశాల తరగతి గదుల్లో పాఠాలు బోధించవలసిన టీచర్లు సెల్ ఫోన్లు వాడరాదని ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ ఉపాధ్యాయులు పెడచెవిన పెడుతూ ఇష్టానుసారంగా వ్యవహరించడం అనైతికం. పని వేళలో వాట్సాప్ గ్రూపులో, ఫేస్ బుక్ వంటి సోషల్ మాధ్యమాల్లో తన అభిమాన అభ్యర్థి కోసం మెసేజ్ లు పెడుతూ కాలం వెలదీస్తున్నారు. విద్యాశాఖ అధికారులు చొరవచూపి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా చూడాలి.

చింతం సిద్దు (ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు)

సర్వే వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్

సర్వే వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.ఈ నెల 16 నుండి 28వరకు సర్వేలో పాల్గొని వారి వివరాలు నమోదు చేసుకోని నగరవాసుల కోసం కుల గణన సర్వే కొనసాగుతున్నందున ఇందుకోసం ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాల్లో నమోదు తీరు పరిశీలనలో భాగంగా కమిషనర్ ఆదివారం కాజీపేట సర్కిల్-2 లో ఏర్పాటు చేసిన సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించి వివరాల నమోదు తీరును పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరవాసులు సర్వేలో కచ్చితంగా పాల్గొనాలన్నారు. ప్రజలకు అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని



కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, రెవెన్యూ అధికారి యూసుఫోద్దిన్, సూపరింటెండెంట్ అనిల్, ఆర్ఐలు దేవరాజ్, రజని, బిల్‌కలెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో 'విజ్‌డమ్' విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నర్సంపేట

శ్రీనివాస రామానుజన్ రాష్ట్ర స్థాయి గణిత, సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలను సాధించారు. కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ నెల 15న నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన కే.కౌశిష్ గణిత పరీక్షలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ, 4వ తరగతికి చెందిన మీర్ ఉస్మాన్ అలీ సైన్స్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానాన్ని సాధించారు. గణిత, సైన్స్ ఒలంపియాడ్‌లో జిల్లాస్థాయిలో 10వ తరగతికి చెందిన ముంజాల సాయి కిరణ్, అనన్య, అర్జున్, అన్వేష్, సుహాస్ ప్రిన్స్, 9వ తరగతికి చెందిన అర్మాన్‌షా,ఫర్మాన్‌షా, అబ్దుల్ ముఖీత్, మనోజ్ఞ ప్రతిభ కనపర్చారు.8వ తరగతికి చెందిన దాసరి నిహారిక, సాయిహర్ష, బేరి మనోజ్ఞ, 7వ తరగతికి చెందిన అసద్, సుశాంత్, కొప్పు యశ్వంత్, విశ్వేశ్ చౌహాన్, చెన్నబోయిన చరణ్, షహజాద్, 6వ తరగతికి చెందిన పుల్లూరి రాజాగౌడ్, శశిధర్, శ్రీనిధి, నాసర్ అలీ, 5వ తరగతికి చెందిన అంకిత్ చంద్ర, సాత్విక్ కృష్ణ, శ్రీహిత్ రెడ్డి, చరణ్, 4వ తరగతికి చెందిన మీర్ ఉస్మాన్ అలీ, మహ్మద్ డ్యానిష్, షణ్ముఖ ప్రియ, 3వ తరగతి చెందిన హిమాచరితారెడ్డి, ప్రేమ్ విరాన్, తన్మయ్‌శ్రీ ప్రతిభను కనపర్చారు. విద్యార్థులకు కేయు వైస్ చాన్సలర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, ఏసీపీ పింగిళి ప్రతాప్



రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్, తిరమలరావు, ఎస్ఆర్ఎఫ్ ఫౌండర్ చైర్మన్ అమరేష్ విద్యార్థుల ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో రాణించి పాఠశాల పేరు ప్రతిష్టలను ఇనుమడంపజేసిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఎస్.డీ.జావెద్, కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్‌చార్జి నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, ప్రీస్కూల్ ప్రిన్సిపాల్ ఫహీమ్ సుల్తానా, రఘుపతిరెడ్డి, శివరాజ్ అభినందించారు.

'ఆర్‌డీఎఫ్'లో ఘనంగా వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడ ఆర్డీఎఫ్ వనిత అచ్యుతాపాయ్ విద్యాలయ జనరల్ అండ్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ద్వితీయ సంవత్సర విద్యార్థులు తమ రెండు సంవత్సరాల కాలంలో జరిగిన విషయాలను నెమరు వేసుకుంటూ వారి అనుభవాలను మొదటి సంవత్సరం విద్యార్థులతో పంచుకున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సమావేశానికి ప్రిన్సిపల్ ఏ జనార్ధన్ అధ్యక్షత వహించి కళాశాలలకు తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని, మంచి ర్యాంకులు సాధించి ఉన్నత విద్యను పొందాలని కోరారు.ఈ సందర్భంగా నృత్య సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు



అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజు, సుధాకర్, సైదులు, సంతోష్, శ్రీనివాస్, జయశంకర్, హైమావతి, మహేష్, సతీష్ పాల్గొన్నారు.



లెక్చరర్‌పై కేసు నమోదు చేయాలి

- విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కాశిబుగ్గ

నగరంలోని కొత్తవాడలో గల ఏకశిలా జూనియర్ కళాశాలలో విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తవాడలోని ఏకశిలా జూనియర్ కళాశాల వద్ద విద్యార్థి సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త వాడలోని ఏకశీల మహిళా జూనియర్ కళాశాలలో సైన్స్ విద్యార్థినిపై ప్రాక్టికల్స్ జరుగుతున్న సమయంలో లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఘటనపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించి ఏకశిలా కళాశాల అనుమతిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు గౌడ్, ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ హాకిమ్ నవీద్ జిల్లా కన్వీనర్ రోహిత్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొచ్చు తిరుపతి, బీసీ విద్యార్థి సంఘం నాయకులు శ్రీనాథ్, గణేష్, రఘు, నితిన్, సాయి పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణం కోసం జోరుగా విరాళాలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని గోపనపల్లిలో శ్రీదూడల మల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధి పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ అభివద్ధి కమిటీకి గ్రామానికి చెందిన తొలి ఆలయ కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ బెల్లం వీరాస్వామి కుటుంబ సభ్యులు బెల్లం లక్ష్మి, విజయ, కుమారులు రవి, మనోహర్, వేణు కోడళ్లు రాధిక, మధులత మనుమడు అవినాష్‌లు విరాళంగా రూ.లు 50,116 గుడి డెవలప్మెంట్ కోసం అందజేశారు. అదే గ్రామానికి చెందిన బెల్లం దేవేందర్-శారదా దంపతులు రూ.10,116, బెల్లం రాకేష్-లావణ్య దంపతులు రూ.15,116, అదే గ్రామానికి చెందిన చెట్టే ఐలయ్య-అనిత దంపతులు రూ.15,116, అదే గ్రామానికి చెందిన నాంపల్లి బుచ్చమ్మ-రమల జ్ఞాపకార్థం నాంపల్లి శ్రీను-రమ దంపతులు రూ.10,116 విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాధిక తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య

నవతెలంగాణ-నయీంనగర్

స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్‌లు 42శాతం ఇవ్వడానికి చట్టబద్ధత కల్పిస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ స్వాగతిస్తుందని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కాడబోయిన లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. లింగయ్య మాట్లాడుతూ కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16నుండి 28వరకు మరో అవకాశం ఇచ్చినందున అందరూ సమాచారం ఇవ్వాలని కోరుతున్నామని, ముఖ్యంగా ఇప్పటివరకు సమాచారం ఇవ్వని రాజకీయ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు



ఇప్పటికైనా ఇవ్వాలని లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో వారు ద్రోహులుగా నిలిచిపోతారని హెచ్చరిస్తున్నామన్నారు. మార్చిలో జరగబోయే అసెంబ్లీ సమావేశంలో 42 శాతం ఇవ్వాలని తీర్మానం పెడతామని, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఢిల్లీ తీసుకు వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు.

నూతన దంపతులకు ఆశీర్వాదాలు

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ముప్పిడి రామచంద్రు-భాగ్యలక్ష్మి కుమార్తె ప్రసన్న శివరాజన్ వివాహ వేడుకలకు ఆదివారం పర్వతగిరి సొసైటీ చైర్మన్



ఎం.మనోజ్ కుమార్ హాజరై ఆశీర్వదించారు. ఆయన వెంట వెంట కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ భూక్యా భద్రు, జనగాం సాయిలు, సునీల్, గ్రామ ముఖ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రక్కును ఢీకొట్టిన టిప్పర్

ఒక్కరి పరిస్థితి విషమం

నవతెలంగాణ-పరకాల

ట్రక్కును, టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో టిప్పర్ డ్రైవర్ తీవ్ర గాయాలై హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నట్లు పరకాల ఎస్ఐ శివకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గీసుకొండ మండలం బొల్లికుంట ఎక్స్‌రోడ్ నుండి టాట వాటర్ బాటిల్స్ వేసుకొని పరకాలకు వస్తున్న ట్రక్కును పరకాల మండలం కామారెడ్డిపల్లి వద్ద పరకాల నుండి హనుమకొండ వైపుగా వెలుతున్న టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో ట్రక్కు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కపోయి రెండు కాళ్ల చేతులు కోల్పోయిన ఘటన హృదయవిదారకంగా



మారింది. స్థానికులు ట్రక్కు నుండి డ్రైవర్‌ను బయటకు తీసి అంబులెన్స్ సహకారంతో నవీన్‌ను చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. కాళ్ల చేతులు విరగడంతో పాటు ఛాతీలో బలమైన దెబ్బలు తగలడంతో నవీన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం.ట్రక్కు యజమాని బదావత్ అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకృష్ణ తెలిపారు.

నేడు వెలుగుల బడి కార్యక్రమం

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్‌లో 17 న (సోమవారం) జేడీ ఫౌండేషన్ చైర్మన్ జేడీ లక్ష్మీనారాయణ టీం ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2గంటలకు గ్రామ పంచాయతీ వద్ద ఉన్న గ్రంథాలయంలో వెలుగుల బడి అనే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫౌండేషన్ టీం సభ్యులు కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు సాయంత్రం స్కూల్ టైం అయిపోయిన తరువాత గ్రామ గ్రంథాలయంలో 5 గంటల నుంచి 8 గంటలవరకు ట్యూషన్ వుంటుందని, పిల్లలకి స్నాక్స్, ఎలాంటి ఫీజ్ లేకుండా జేడీ ఫౌండేషన్ వారిచే ఉచితంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేడీ ఫౌండేషన్ తెలంగాణా కన్వీనర్ కవితరెడ్డి, అనంతలక్ష్మి హాజరవుతారని చెప్పారు. గ్రామ ప్రజలు అందరూ సహకరించాలని జేడీలక్ష్మీనారాయణ జేడీ ఫౌండేషన్ టీం సభ్యులు పిలుపునిచ్చారు.

20న చలో హైదరాబాద్

నవతెలంగాణ-వర్ధన్నపేట

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6గ్యారంటీల హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించి14 నెలలు దాటినా అమలులోకి రాలేదని విమర్శించారు. ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య పార్కు నుండి ఇందిరా పార్క్ వరకు ప్రజా ప్రదర్శన ఉంటుందని, అనంతరం ధర్నా చౌక్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.



వన దేవతలను దర్శించుకున్న ఎమ్మెల్యే రేవూరి

నవతెలంగాణ-ఆత్మకూరు

మండలం అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మలను ఆదివారం పరకాల రేవూరి ప్రకాష్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్ల ఆశీర్వాదం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే జాతరలో భక్తులకు మరింత మెరుగైన సకల సౌకర్యాలు సమకూరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ భీరం సునంద సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కమలాపురం రమేష్, మాజీ జెడ్పిటిసి కక్కెర్ల రాధిక రాజు,సొసైటి మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ పరికరాల వాసు, మాజీ జాతర చైర్మన్ బొరిగం స్వామి, అలువాల రవి, ఆత్మకూరు, దామెర మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరె కులస్తులు ఓబీసీ సాధనకు కృషి చేయాలి

- ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకన్న

నవతెలంగాణ-ఎల్కతుర్తి

ఆరె కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ సాధనకు ఆరె సంక్షేమ సంఘ నేతలు కృషి చేయాలని, ఢిల్లీలోని మకాం వేసి సర్టిఫికెట్ సాధించిన తర్వాతే తెలంగాణకు రావాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న అన్నారు. ఆదివారం ఆయన ఎల్కతుర్తి మండల పరిధిలోని దామెర గ్రామంలో ఛత్రపతి శివాజీమహరాజ్ విగ్రహావిష్కరణకు హాజరై మాట్లాడారు. విగ్రహ కమిటీ చైర్మన్ మోడీ అధ్యక్షతన సభ నిర్వహించారు. ముందుగా చత్రపతి శివాజీ ఆవిష్కరణ చేసుకొని భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, విగ్రహావిష్కరణకు శ్రమించిన దామెర గ్రామ విగ్రహ కమిటీ, ఆరె సంక్షేమ సంఘ కమిటీని ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆరె కులస్తులకు సూచించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అద్భుతమైన శివాజీ విగ్రహాన్ని దామెరలో ఆవిష్కరించిన ఆరె సంఘం కమిటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ, ఆరె సంక్షేమ సంఘం ఉద్యమ కమిటీ చైర్మన్ సోమిడి అంజన్‌రావు, సంఘ ఉపాధ్యక్షుడు జెండా రాజేశ్, మండల గౌరవ అధ్యక్షులు సుఖినే సంతాజీ, సుక్కిన సుధాకర్ రావు, హింగే భాస్కర్, సాంబరావు, గ్రామ శాఖ అధ్యక్షుడు కదమ్ రాజు, కోశాధికారి వరికల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



శివరాత్రి కరపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

ఓరుగల్లు వైభవాన్ని, శివతత్వాన్ని చాటేలా ఆధ్యాత్మిక నిలయమైన ఓరుగల్లు గడ్డపై ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న మహా శివరాత్రి కార్యక్రమ కరపత్రికను ఆదివారం భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకులు, గురు పూజ్యులు శేషు అయ్యగారి చేతుల మీదుగా ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గేయ రచయిత వెన్నెల శ్రీనాథ్, ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి చిరంజీవి హిమాన్సి కాట్రగడ్డ, ఇండస్ ఫౌండేషన్ సభ్యులు పత్రికా విలేకరుల సమావేశంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా భద్రకాళి దేవాలయ ప్రధానార్చకులు శేషు ఓరుగల్లు కేంద్రంగా ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంతటి బృహత్తర కార్యక్రమం చేపడుతున్నందుకు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి బృందానికి శుభాశీస్సులు తెలిపారు. ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లు ఒక గొప్ప ఆధ్యాత్మిక శక్తి కేంద్రం, కాశీ, రామేశ్వరం లాగా మన ఓరుగల్లు కూడా శివతత్వానికి నిలయమన్నారు. మన వారసత్వ వైభవాన్ని, మన సంస్కృతి, సాంప్రదాయాలు, కళల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడం కోసమే ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రయత్నం మొదలు పెట్టినట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి కార్యక్రమ కో ఆర్డినేటర్‌లు అభిషేక్, దీపక్, కార్పొరేటర్ రవి నాయక్, డాక్టర్ కొమురన్న, శనబోయిన రాజు కుమార్, జంపన్న, దేవయ్య, కొండారి రవి, గొల్ల నరేందర్, తోట సూకాంత్, కొనుకటి ప్రశాంత్, జెట్టి రాజేందర్, విజయ్, శ్యాం, గువ్వ రాజేష్, వినయ్, వంశీ, లక్ష్మణ్, అఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే చల్లా

కేసీఆర్ జన్మదినం సందర్భంగా సేవాకార్యక్రమాలు నిర్వహణకు పిలుపు

నవతెలంగాణ -పరకాల

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హనుమకొండలోని ఆయన నివాసంలో వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు బిఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు.అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధకులు కేసీఆర్ మానస పుత్రిక అయిన హరితహారంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చడం జరిగిందని తెలిపారు. గడిచిన పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. పదేండ్లలో జరిగిన అభివృద్ధి గడిచిన సంవత్సర కాలంలో కాంగ్రెస్ పాలనలో చాలా నష్టానికి గురైందన్నారు. కాంగ్రెస్ బోగస్ హామీలు నమ్మి మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. కేసీఆర్ నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు.కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా పరకాల నియోజకవర్గంలోని అన్నిమండల కేంద్రాలలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించాలని, సాధ్యమైనంత వరకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా ఉంటా : చల్లా

నవతెలంగాణ-దామెర

రోడ్డు ప్రమాదంలో గాయపడిన దామెర మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తాత కొమురయ్యను ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం నుంచి రావాల్సిన వాటా ఇవ్వాలి

వరంగల్ నగర అభివద్ధికి సహకారం అందించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన ఎమ్మెల్యే నాయిని

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



హనుమకొండ నగరానికి ఆదివారం విచ్చేసిన కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను కేటాయించాలని, స్మార్ట్ సిటీ, అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ (అమత్) నిధులను విడుదల చేసి నగరాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కేంద్ర పురావస్తు శాఖలో ఉన్న వేయి స్తంభాల దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రాన్ని అందించారు. వరంగల్ మహానగర పాలక సంస్థ అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరగతిన ఇప్పించాలని కోరారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి ఎమ్మెల్యే వినతికి సానుకూలంగా స్పందించి నిధుల అమలకు సహకరిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పిసిసి సభ్యులు బత్తిని శ్రీనివాస్‌రావు, ఈవీ శ్రీనివాస్‌రావు ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌గా మారిన డ్రైనేజీ..!

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు ఇబ్బందుల్లో స్థానికులు

నవతెలంగాణ-పరకాల





పరకాల పట్టణ ప్రజలను పారిశుధ్య సమస్య వెంటాడుతోంది. చికెన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్ యజమాన్యాలు హుజురాబాద్ రోడ్డులోని కాసం షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలోగల డ్రైనేజీని డంపింగ్ యార్డ్‌గా ఉపయోగిస్తుండటంతో డ్రైనేజీ పరిసర ప్రాంతాలు మురికికూపంగా తయార య్యాయి. కుక్కలు, పందులు చేరి చికెన్ వ్యర్థాలతో కుస్తీ పాట్లు పడు తుండడంతో డ్రైనేజీ ప్రాంతాలు తీవ్ర దుర్గం దాన్ని వెదజల్లు తున్నా యని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు మార్లు మున్సి పాలిటీ అధికా రులకు సమస్యను తెలియ జేసినప్పటికి పట్టిపట్టనట్లు వ్యవ హరిస్తున్నారంటూ పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ షాపింగ్ యజ మాని తెలిపారు. పట్టణంలోని పలు చికెన్ సెంటర్ యజమాన్యాలు వ్యర్థాలను పాలింథీన్ కవర్లలో మూటలు మూటలుగా తీసుకొచ్చి అక్కడ పడ వేస్తున్నట్లు సమాచారం. అంతేగాకుండా పక్కనే ఉన్న కాసం షాపింగ్ కాంప్లెక్స్ నుంచి సైతం చెత్తను మూ టలుగా తీసుకొచ్చి అక్కడ పడవ వేస్తున్నట్లు స్వ యానా మున్సిపల్ అధికారులే తెలపడం గమనార్హం.

> **చెత్తా చికెన్ వ్యర్థాలు డ్రైనేజీలో వేస్తున్న మాట నిజమే**
>
> హుజురాబాద్ రోడ్ లోని డ్రైనేజీలో చెత్త, చికెన్ వ్యర్థాలు వేస్తున్న మాట నిజమే. ఇది కొంతమంది చికెన్ సెంటర్ యజ మానులు, కాసం షాపింగ్ కాంప్లెక్స్ నుంచి జరుగు తున్నట్లు గుర్తించారు. వీరికి నోటీసులు ఇచ్చి చర్యలు చేపడతాం.
>
> **ప్రశాంత్ (మున్సిపల్ సానిటరీ ఇంచార్జి, పరకాల)**

చికెన్ వ్యర్థాలతో ప్రమాదకరంగా ప్రజల ఆరోగ్యం

చికెన్ వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ విచ్చలవిడిగా పడవేయడం ప్రజల ఆరోగ్యానికి ప్రమాద మని పలు ఆరోగ్య వేదికలు తెలుపు తున్నాయి. చికెన్ సెంటర్ యజమాన్యాలకు అవగా హన కల్పించి చికెన్ వ్యర్థాలను జనవాసాలకు దూరంగా పడవేసేలా చర్యలు చేపట్టాల్సిన మున్సి పల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహ రించడంతో చికెన్ సెంటర్ యజమాన్యాలు డ్రైనేజీ కాలువలను డంప్పింగ్ యార్డులుగా ఉపయో గిస్తున్నారు. దీంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదకరంగా మారు తుంది. అక్కడ కుక్కలు, పందులు చేరి దోమల ఉధృతికి కారణమ వుతుండడమే కాకుండా ఇటీవల కుక్కల్లో ప్రబలుతున్న డెర్మటైటిస్, బ్రూసెల్ల ఇథిపికల్ వ్యాధులు చికెన్ వ్యర్థాలు, పచ్చి మాంసం, కలుషిత నీటిని తాగడం వల్లే వస్తున్నట్లు పలు వైద్య నివేదికలు సూచిస్తున్నాయి. ఇటీవల కాలంలో, రాజన్న సిరిసిల్ల జిల్లా, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డర్మటైటిస్ వ్యాధులు మనుషులకు కుక్కల ద్వారానే సోకినట్లు పలు మీడియా కథనాలు వెలువడుతున్నాయి. ఈ స్థితిలో పరకాల మున్సిపల్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారునుందని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్ లుగా మారిన డ్రైనేజీలను శుభ్రం చేసి, చికెన్ సెంటర్, షాపింగ్ కాంప్లెక్స్ యజమాన్యాలకు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉదంటు పలు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

> **మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలి**
>
> 
>
> హుజురాబాద్‌రోడ్‌లోని డ్రైనేజీని డంపింగ్ యార్డ్‌గా ఉపయోగిస్తున్న, చికెన్ సెంటర్ యజమాన్యాలను, కాసం షాపింగ్ కాంప్లెక్స్‌పై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పచ్చదనం పరిశుభ్రతపై ప్రభు త్వం అనేక రకా లుగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ పరకాల మున్సిపల్ అధికారులు మాత్రం మాకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరించడం సరైంది కాదు.
>
> **బొచ్చు కళ్యాణ్ (సీపీఎం నాయకులు)**

> **పర్మినెంట్ సానిటరీ ఇన్స్పెక్టర్ లేకపోవడమే అపరిశుభ్రతకు కారణం**
>
> 
>
> పరకాలలో పర్మినెంట్ సానిటరీ ఇన్స్పెక్టర్ లేకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం పరకాల మున్సిపాలిటీకి పర్మినెంట్ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాల్సిన అవసరం ఉంది. అప్పుడే పరకాలలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొంటుంది. ప్రతి నెలకు ఒక సానిటేషన్ ఇన్స్పెక్టర్ను మారుస్తూ ఉండ డంతో పట్టణ పరిశుభ్రత పట్ల ఎవరికి బాధ్యత లేకుండా పోతుంది. కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ సానిటేషన్ పట్ల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
>
> **నక్క చిరంజీవి (బీఆర్ఎస్ పట్టణ నాయకులు)**

మురికివాడలు లేని నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి 4వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



హనుమకొండ, వరంగల్, ఖాజీపేట నగరాన్ని మురికి వాడలు లేకుండా చేయడమే ప్రధాన ధ్యేయం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందం రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ పెద్దమ్మగడ్డ, జ్యోతిబసు కాలనీ, యాదవనగర్ కాలనీల్లో విస్తృత పర్యటన చేశారు. ఆయా కాలనీలలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డులో స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజల వద్ద పాలన కొనసాగిస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ప్రజలకు సుభిక్ష సుపరిపాలన అందించడం లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పరిపాలనపరమైన సలహాలు ఇవ్వాల్సిన ప్రతిపక్షాలు నిత్యం ప్రజలను తప్పుదోవ పట్టించే పనిలో నిమగ్నమై ఉందని ఎద్దేవా చేశారు. నాలుగో డివిజన్ పరిధిలో ఉన్న అంతర్గత రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైన్‌ల నిర్మాణం, తాగునీటి, విద్యుత్ సుందరీకరణ పనుల న్నింటినీ దశలవారీగా పూర్తి చేసి మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణంలో నాయకులు, కార్య కర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజేందర్, కుమార్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు, మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, నాయకులు తోట రమేష్, మొహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ తనిఖీ

నవతెలంగాణ-దామెర



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు మెరు గైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజలకు వైద్యపరమైన ఖర్చులను తగ్గించవచ్చునని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. ఆదివారం దామెర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ ఫార్మసీ వ్యాక్సిన్ స్టోర్, ఆయుష్, ఎన్‌సిడి, ఇతర విభాగాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆశాలు ,ఏఎన్ఎంలు, సూపర్వైజర్లు ప్రజలకు వివిధ ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కలిగించడం తగిన జాగ్రత్తలను తెలియజేయడం వల్ల ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడం వలన వారికి ఉన్నత స్థాయి వైద్య సేవలకు వెళ్లకుండా కాపాడవచ్చునన్నారు. పిహెచ్‌సిలోని వివిధ సిబ్బంది క్షేత్ర స్థాయిలో వారు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసు కున్నారు. సూపర్వైజర్, వైద్యాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన మెలకువలను ఎప్పటికప్పుడు నేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హన్మకొండ డీఎంహెచ్ఓ అప్పయ్య, పిఓడిటిటి డాక్టర్ కే లలితాదేవి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ ఇఫ్తార్‌అహ్మద్, డాక్టర్ మంజుల, వైద్యాధికారి డాక్టర్ మహేంద్ర, డాక్టర్ ప్రమోద్ కుమార్, జిల్లా మాస్ మీడియా అధికారి వి అశోక్‌రెడ్డి, సిహెచ్ఎస్ లీల, సూపర్వైజర్ శ్రీకాంత్, భాగ్యలక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ కోసం కేంద్రం రూ. 10లక్షల కోట్లు ఖర్చు

రుణాల రూపంలో మరో రూ.10లక్షల కోట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-సుబేదారి



బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణ కోసం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, మరో రూ.10 లక్షల కోట్లు రుణాల రూపంలో ఇచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి బొగ్గు గనుల శాఖ కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హన్మకొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామగుండంలో రూపాయలు 7వేల కోట్లతో యూరియా యూనిట్, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, జాతీయ రహదారుల కోసం రూ. 1.20 లక్షల కోట్లు, రూ. 80 వేల కోట్ల నిర్మాణం కొనసాగుతుందని, వరంగల్ స్మార్ట్ సిటీ పనులు, రామప్ప దేవాల యానికి రూ.150 కోట్ల కేటాయింపు, యూనిస్కో గుర్తింపు, 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ, కొమురవెల్లి రైల్వే స్టేషన్, సమ్మక్క సారాలమ్మ దేవాలయ అభివద్ధికి రూ.1000 కోట్లు, ఎయిమ్స్ ఆసుపత్రికి నిర్మాణానికి రూ.1350 కోట్లు, హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు ఎంఎంటీఎస్‌కు పచ్చజెండా ఊపామన్నారు. ఎన్టీపీసీ 850 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, ఫ్లోటింగ్ యూనిట్, ఎరువులపై రూ.60వేల కోట్ల సబ్సిడీ, కిసాన్ సన్మాన్ నిధి, గ్రామ పంచాయితీలకు రూ.13వేల కోట్లు, ఇన్ కంట్యాక్స్ రూ.12.75 లక్షల వరకు తగ్గింపు, జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ పార్కు, ఐదు కేజీల ఉచిత బియ్యం కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు.ప్రాగా టూల్స్, ఐడీపీఎల్, హెచ్ ఎంటీ, ఆల్విన్ లాంటి అనేక సంస్థలు మూత పడ్డాయన్నారు. బయ్యారం సంస్థ స్థాపించాలంటే లాభమా? నష్టమా? అనే సర్వే ప్రకారం ముందుకు వెళతామన్నారు. బయ్యారంపై కేంద్రం ప్రకటన చేయలేదన్నారు. తామే ఏర్పాటు చేస్తామని 2018లో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌లు చంకలు గుద్దుకున్నారని చెప్పారు. వాస్తవంగా ఆ సంస్థ రావాలనే తనకూ ఉందని, కానీ స్టీల్ లభ్యత ఉండదని తెలిసిన తరువాత ప్రజల డబ్బును నష్టం చేయలేమన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏం చేసిందో సవివరంగా రాయాలని మీడియా ప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రశ్నలు అడగడంతో పాటు వాటి వివరణ, నిజ నిజాలను కూడా రాస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో ఈ నెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు ఉపాధ్యాయ, పట్టభద్రుల మూడు ఎన్నికల్లోనూ బీజేపీ పోటీ చేస్తుందని తెలిపారు. మూడుస్థానాల్లో బీజేపీకి సుహృ ద్భావ వాతావరణం కనిపిస్తుందని ఉపాధ్యా యులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పట్ల పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. శాసనమండలిలో అడుగడుగునా కాంగ్రెస్ హామీలను నిలదీస్తాం, ప్రశ్నిస్తామని ఇప్పటి వరకు ఆ పార్టీకి ఇచ్చిన సమయం ఎప్పటికో పూర్తయి పోయిందన్నారు. బీఆర్ఎస్ అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించి కుటుంబం అంతా దోచుకున్నదని ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా అదే దిశలో పాలిస్తుందని విమర్శించారు.మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలు అప్పుల పాలు చేశాయన్నారు.



ది స్వయంవార్ దశమ వార్షికోత్సవాలు

నవతెలంగాణ-నక్కలగుట్ట

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2015ప్రారంభించిన ది స్వయంవార్ మొదట తెలుగు రాష్ట్రాలలో ప్రారంభమై పదేండ్లు పూర్తి చేసిన సందర్భంగా ఆదివారం దశమ వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం సంస్థ డైరెక్టర్ ఓం నమశ్శివాయ మాట్లాడుతూ వరంగల్‌లో ప్రారంభమైన ఈ స్టోర్స్ ఇప్పుడు దేశవ్యాప్తంగా 12రాష్ట్రాలు 47నగరాలలో 85బ్రాంచ్‌లు విస్తరించాయని తెలిపారు. రానున్న మరికొద్ది రోజులలో 100బ్రాంచ్‌లు విస్తరిస్తామని, వివాహ ది శు భకార్యలకు, పిల్లలకు, యువకులకు, పెద్దవాళ్లకు అందరికీ అందుబాటులో ధరలలో షేర్వానీ, ఇండో వెస్టన్ జోదుపురి, బ్లేజర్స్, సెమీ ఇండో వెస్టన్ కుర్తా పైజామా, మోడీ సెట్, పట్టు పంచె, పగిడి, ముజిడి టైపర్ఫ్యూమ్స్, దుపట్టా, లెనిన్ కుర్తాస్ షర్ట్స్, ప్రత్యేకతలు కల కలెక్షన్స్ ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు అయిన కాసం శివప్రసాద్, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, పిఎస్ మూర్తి, పుల్లూరి అరుణ్ కుమార్, ఆర్యవైశ్య జాతీయ కార్యదర్శి గట్టు మహేష్‌బాబు పాల్గొన్నారు.

మీనాక్షి నటరాజన్‌కు రంజిత్‌రెడ్డి అభినందనలు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన మీనాక్షి నటరాజన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్ల రంజిత్‌రెడ్డి తెలిపారు. 1999లో ఎన్ఎస్‌యుఐ అధ్యక్షురాలిగా ప్రస్థానం ప్రారంభించిన మీనాక్షి నటరాజన్ 2008లో ఏఐసీసీ కార్యదర్శి ఎంపికయ్యారని తెలిపారు. 2022లో భూదానో ద్యమానికి 75ఏండ్లు పూర్తయిన సందర్భంగా మీనాక్షినటరాజన్ తెలంగాణలో పర్యటించారని గుర్తు చేశారు. 2023లో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికల పరిశీలకురాలుగా పని చేసిన మీనాక్షి నటరాజన్ నేడు కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జిగా నియమించినందుకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు.

నేడు జిల్లాస్థాయి యువజన క్రీడోత్సవాలు

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

ఈ నెల 17,18న హన్మకొండ జిల్లా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో హన్మకొండ జిల్లా స్థాయి యువజన క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర వరంగల్ జిల్లా అధికారి చింతల అన్వేష్ తెలిపారు. హనుమకొండ జిల్లాలో తాలుక స్థాయిలో నెహ్రూ యువ కేంద్ర నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొనడానికి అర్హులని అన్నారు. వాలీబాల్, రన్నింగ్, షెటిల్, సింగిల్స్ పోటీలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. యువతులకు కబడ్డీ, షటిల్ సింగిల్స్, రన్నింగ్ పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ క్రీడలకు 15నుండి 29వయసు గల యువతి యువకులు అర్హులని తెలిపారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్, మెడల్ మెమొంటోను అందజేస్తామని, జిల్లా స్థాయిలో గెలిచిన విజేతలను రాష్ట్రస్థాయిలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంతుని చెప్పారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆత్మకూరు

గతంలో నిర్వహించిన సమగ్ర ఇంటింటి సర్వేలో నమోదు చేసుకోని వారు ఈ నెల ఆదివారం 16నుండి 28వరకు సమాచార నమోదు చేసుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వ మరో అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీవో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్-ఫ్రీ నెంబర్ 040-21111111ను సంప్రదించి, లేదా మండలంలోని ప్రజా పాలన కేంద్రాల్లో సమాచారం ఇచ్చి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. గత సర్వే సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆసక్తి లేకపోవడం తదితర కారణాల వల్ల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే హౌస్ లిస్ట్‌లో ఉండి సర్వే చేయని కుటుంబాలకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు.

అమెరిక యువతితో యువకుడి పెళ్లి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



అమెరికాకు చెందిన యువతితో హనంకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన యువకుడికి వివాహం జరిగిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. నీరుకుల గ్రామానికి చెందిన రఘునాథ్‌రావు- వైశాలి దంపతుల కుమారుడు సతీష్‌చంద్ర ఉన్నత చదువుల కోసం పదేళ్ల క్రితం అమెరికాకు వెళ్లిఅక్కడ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. 2021లో అమెరికాలోని టొరంటో రాష్ట్రానికి చెందిన జెస్సికా అనే యువతితో పరిచయం ఏర్పడింది. జెస్సికతో ఏర్పడిన పరిచయం కాస్తగా ప్రేమగా మారింది. దీంతో ఇరు కుటుంబాల అంగీకారంతో హిందూ సాంప్రదాయం ప్రకారం హనుమకొండలోని పెద్దమ్మగడ్డ రోడ్‌లోని ఏఆర్ఆర్ గార్డెన్లో వివాహం జరిగింది.

వరికెల కిషన్‌రావుకు ఘన సన్మానం

నవతెలంగాణ-నడికూడ



ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో కిసాన్ దివాస్ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా గత 20 ఏండ్లుగా వ్యవసాయం చేస్తూ, వివిధ పంటలు పండిస్తూ, అధిక దిగుబడి సాధిస్తున్న ఆదర్శ రైతు వరికెల కిషన్‌రావుకు ఆకాశవాణి వరంగల్ కేంద్రం ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్, వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారులు కే.అనురాధ, ప్రధాన శాస్త్రవేత్త దిలీప్ కుమార్, జిడబ్ల్యుఎంసి ఉద్యానవన శాఖ అధికారి రమేష్‌లు మెమెంటో, ప్రశంసా పత్రం ఇచ్చి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆకాశవాణి వరంగల్ కేంద్రం ప్రోగ్రామ్ హెడ్ ఇల్లందుల రవికుమార్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం చేయడమే కాకుండా వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటల్లో అధిక దిగుబడి సాధించినందుకుగాను సన్మానం చేసినట్టు తెలిఆపరు. ఈ సందర్భంగా వరికెల కిషన్‌రావు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారితో పాటు వరికెల కిషన్ రావుకు గ్రామస్తులు, బంధువులు, మిత్రులు, రైతులు శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి



నవతెలంగాణ-గణపురం

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టి డ్రైవర్ మృతిచెందిన సంఘటన గణపురం మండలంలో ఆదివారం చేటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... గాంధీనగర్ గ్రామానికి చెందిన మోటపోతుల రాజు (35)కు సొంత ట్రాక్టర్ ఉంది. ఆయనే డ్రైవింగ్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గాంధీనగర్ నుండి మైలారం వైపు వెళ్తుండగా ప్రమా దవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టింది. దీంతో రాజుకు రెండు కాళ్లు విరిగి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా ట్రాక్టర్ బోల్తా పడిందా లేక ఏదైనా ? వాహనం డీ కొందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

గోసంగి కుల సంక్షేమానికి కృషి : జన్నారపు రమేష్



నవతెలంగాణ-గోవిందరావుపేట

గోసంగి కుల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జన్నారపు రమేష్ అన్నారు. ఆదివారం ములుగు జిల్లా గోసంగి కుల జిల్లా కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులుగా జన్నార రమేష్, ప్రధాన కార్యదర్శిగా మండేద్దుల రమేష్, గౌరవాధ్యక్షులుగా జన్నారపు సదానందం, వెంకటస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణను స్వా గతిస్తున్నామన్నారు. గోసంగీ ఉప కులంను అన్ని విధాలా ఆదుకోవాలని, ఎస్‌సి వర్గీకరణలో ఉప కులమైన గోసంగీ కులం జనాభా లెక్కల ప్రకారం న్యాయం చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో గోదా కనకయ్య, జన్నారపు రాజ్ కుమార్, పుష్పలీల, శతిష్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



కాలుష్య నివారణకే సక్షమ్ కార్యక్రమం

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

కాలుష్య నివారణకే కేంద్ర ప్రభుత్వం సక్షమ్ ప్రోగ్రాం ప్రవేశపెట్టిందని, డీజిల్ పెట్రోల్ వినియోగాన్ని తగ్గించి సోలార్ వినియోగాన్ని పెంచుకోవాలని భూపాలపల్లి మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, హెచ్పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ కే వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం హెచ్పీసీఎల్ వారి ఆధ్వర్యంలో సక్షమ్ కార్యక్రమంపై భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం కోసమే కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్పిసిఎల్ సేల్స్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు, డీలర్ గండ్ర హరీష్ రెడ్డి, అశోక్ రెడ్డి, మహేందర్, సిఎస్‌పి సిబ్బంది, గ్యాస్ డీలర్స్ కె శ్యామ్, భూపాలపల్లి పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హమాలీ కార్మికుడు మృతి

ఎంఎల్ఐఎస్ పాయింట్ ఇన్‌చార్జి గంగాధర రాజు ఆర్థికసాయం



నవతెలంగాణ-చిట్యాల

సివిల్ సప్లై గోదాంలో పనిచేస్తున్న హమాలీ కార్మికుడు ఆరేపెల్లి ఎల్లయ్య(52) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చిట్యాల సివిల్ సప్లై గోదాం ఇన్‌చార్జి గంగాధర రాజు చేయూతనిచ్చాడు. మృతుడి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తె లిపారు. రానున్న రోజుల్లో అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు సరిగోమ్ముల సురేష్, ముత్యాల మధు, ఆ రెపెల్లి సమ్మయ్య, కట్కూరి కుమార్, శిలపాక నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి మత్స్యకారుడు మృతి

నవతెలంగాణ-రేగొండ

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు చెరులో పడి మృతిచెందిన సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడవటంచ గ్రామానికి చెందిన పోలు ఓదెలు(46) వృత్తిలో భాగంగా శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని కోనేటి చెరువులో చేపల వేట కోసం వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చేపల కొరకు వేసిన వల ఓదెలుకు చిక్కుకుని నీటిలో పడి ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన తోటి మత్స్యకారులు, గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా రేగొండ ఎస్సై ఎస్ సందీప్ కుమార్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


విద్యార్థుల కోటగుళ్ల విజ్ఞాన విహారయాత్ర



నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండి లింగంపల్లి ప్రాథ మిక పాఠశాల విద్యార్థులు విజ్ఞానవిహారాయాత్రలో భాగంగా కోటగుళ్లను ఆదివారం సందర్శించారు. ఆలయ విశిష్టతను శిల్ప సౌందర్య గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల హెచ్ఎం రాజు ఉపా ధ్యాయులు మోహన్ రెడ్డి, సుజాత, శివకుమార్, రూప, నవ్య, రేణుక పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2010-11 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. గతాఅనుభవాలను నెమరు వేసుకున్నారు. 14 సం వత్సరాల క్రితం చదువు పూర్తి చేసుకుని వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారంతా ఒక్కదగ్గర కలుసుకుని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యా ర్థులు నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు

నూతన ఇసుక విధానం.. ఒకరిపై బదిలీ వేటు

నవతెలంగాణ-మహదేవపూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల ఇసుక విధానంపై నూతన పాలసీ ప్రవేశపెట్టి పేదలకు సరసమైన ధరలకు ఇసుక అందించడం వల్ల అక్రమాన్ని అరికట్టాలని అధికారులను ఆదేశించిన విషయం విధితమే. ఈక్రమంలో మహదేవపూర్ మండలంలోని పలు క్వారీలను తనిఖీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లో అక్రమంగా ఇసుక రవాణా జరకూడదని ఆదేశించారు. జిల్లా స్థాయిలో అడిషనల్ కలెక్టర్, కాటారం డీఎస్పి, భూపాలపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పడి మండలంలోని పలు ఇసుక క్వారీలను తనిఖీ చేసి వెళ్లారు. అనంతరం ఇంటిలిజెన్స్ ఎస్పీ భాస్కర్ ఆధ్వర్యంలో మరో బృందం పర్యటించి పలు ప్రాంతాలను సందర్శించి వెళ్లింది. అధికారుల పర్యటన అయిన ఒక్క రోజులోనే పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇక్కడి టీజీఎండీసీ పీఓను బదిలీ చేశారు. తాజాగా నల్లగొండలో పని చేస్తున్న పీఓను ఇక్కడికి బదిలీ చేశారు. ఇప్పటికైనా ఇసుక క్వారీలో య జమానులు, టీజీ ఎండీసీ సిబ్బంది రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఇసుక పాలసీ నిబంధనతో నడిపించాలని పలువురు కోరుతున్నారు.

'హరికృష్ణగౌడ్, సాయన్నను ఆదరించాలి'

నవతెలంగాణ-మల్హర్‌రావు

త్వరలో జరగనున్న మెదక్, అదిలాబాద్, నిజామబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణగౌడ్, బీఎస్పీ బలపర్చిన టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి యటకారి సాయన్న ముదిరాజ్‌కు మొదటి ప్రాధన్యత ఓటు వేసి ఆదరించాలని బహుజన్ సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్‌యాదవ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు, మెరుగైన విద్యావిధానం కోసం, బడ్జెట్ కేటాయించేలా శాసనమండలిలో గళం వినిపించేందుకు ప్రసన్నహరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు, బీఎస్పీ పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు గోట్టె రాజు, పెద్దపల్లి జిల్లా ప్రధానకార్యదర్శి కాంపెల్లి బాబు, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులు బోంకురి దుర్గయ్య, ప్రధానకార్యదర్శి సాతురి అనిల్ ,సుల్తానాబాద్ మండల అధ్యక్షులు బోయిని రంజిత్,రామీళ్ళ శారద,పాల్గొన్నారు.

మేడారంలో పోటెత్తిన సందర్శకులు









- పోలీసులు భారీ బందోబస్తు
- క్యూలైన్ల ద్వారానే దర్శనాలు

నవతెలంగాణ -తాడ్వాయి

ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతరైన మేడారం సమమ్మక్క సారలమ్మ జాతర తరువాత ఏడాది నిర్వహించే మినీ మేడారం జాతర ముగిసిన విషయం విధితమే. ఆదివారం సెలవు దినం కావడంతో సందర్శకులు పోటెచ్చారు. జంపన్న వాగులో స్నానాలు ఆచరించి గద్దెల వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు, ఎండోమెంట్ అధికారులు ఆలయ సాంప్రదాయాల ప్రకారం డోలు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజు వనదేవతలకు ఇష్టమైన పసుపు కుంకుమ చీర సమర్పించి ప్రత్యేక మొక్కలు చెల్లించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు ములుగు డీఎస్పీ ఎన్ రవీందర్, పస్రా సీఐ గద్ద రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని చర్యలు చేపట్టారు. నర్సంపేటకు చెందిన సందర్శకులకు సంబంధించిన తొమ్మిది నెలల పాప రద్దీలో తప్పిపోయింది. ములుగు డీఎస్పి ఎం రవీందర్, పస్రా సీఐ గద్ద రవీందర్, స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అప్రమత్తమై మొత్తం జాతర ప్రాంగణంలో పరిశీలించి ఆ పాపను గుర్తించి వెంటనే వారి కుటుంబానికి అప్పజెప్పారు. ఇలా జాతరలో పోలీసులు విశిష్ట సేవలు అందించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు చేపట్టి భక్తులు ప్రశాంతంగా వనదేవతల గద్దెల వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లి విందు భోజనాల ఆరగించి తిరిగి ఎవరి గ్రామాలకు వారు వెళ్లే విధంగా అన్ని చర్యలు తీసుకున్నారు.







కునుకు లేకుండా చేస్తున్న 'పులి'





- భయాందోళనలో కాటారం, మహదేవపూర్ మండలాల ప్రజలు
- నస్తూర్పల్లి అడవుల్లో పాదముద్రలు గుర్తింపు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- రేంజర్ రవి

నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం/కాళేశ్వరం

వారం క్రితం కాటారం మండలంలోని నస్తూర్పల్లి అడవుల్లోకి అటవీ ప్రాంతంలో గుర్తించిన పులి పాద ముద్రలోని అటవీ క్షేత్రంలోనే పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం మహదేవపూర్ పరిధి లోని మహదేవపూర్-కాళేశ్వరం ప్రధాన రహదారిపై అన్నారం క్రాస్, బీరాసాగర్ పోచమ్మ వద్ద పలువురు వాహనదారులు పులిని చూసినట్లు అటవీ అధికారు లకు సమాచారం అందించారు. శనివారం ఉద యం అటవీ అధికారులు బీరసాగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో పాదముద్రలను గుర్తించారు. వెళ్లిన వ్యక్తి పెద్ద పులిని చూసి అటవీ అధికారులకు సమాచారం అందించిన విషయం విధితమే. అప్పటి నుంచి అటవీ అధికారులు బృందాలుగా ఏర్పడి కాటారం మండల పరిధిలో నస్తూర్పల్లి, వీరాపూర్, జాదరావుపేట, గుండ్రాత్పల్లి, దామెరకుంట, మహదేవపూర్ పరిధిలోని అన్నారం సమీప అడవుల్లో పులి కోసం అన్వేషిస్తున్నారు. పులి జాడ కోసం రెండ్రోజుల క్రితం నాలుగు సీసీ కెమెరాలను అమర్చారు. బీర సాగర్ ప్రాంతంలో పులిని చూశామని వాహనదారులు తెలపడంతో అటవీ అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఉచ్చులు బిగించి వన్య ప్రాణాలను వేటాడే పలువురికి ముందస్తుగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని, అడవుల్లోకి వెళ్లవద్దని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. చెన్నూరు మీదుగా మహారాష్ట్ర వెళ్లే అవకాశం ఉందని అటవీ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు కాటారం, మహదేవపూర్ మండలాల ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు పులిజాడ కనుక్కొని అటవీ ప్రాంతాల గ్రామాలైన ప్రజల భయాన్ని పోగొట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మహాదేవపూర్ మండలం అడవుల్లో పెద్దపులి సంచరిస్తున్నట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం అటవీ శాఖ అధికారులు రేంజర్ రవి ఆధ్వర్యంలో బీరసాగర్ అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఒక వాగులో పెద్దపులి పాదముద్రలు గుర్తుంచి గాలింపు చెర్యలు చేపట్టారు. అనంతరం రేంజర్ రవి మాట్లాడుతూ... గ్రామాల్లో ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పశువుల కాపారులు అడవిలోకి వెళ్ళకూడదన్నారు. గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రయాణ ప్రాంగణంలో ప్రయాసలు

- షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

నవతెలంగాణ-భూపాలపల్లి టౌన్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లోని బస్టాప్‌లో బస్సు షెల్టర్ లేదు. నిత్యం హనుమకొండ, కాళేశ్వరం, గోదావరిఖని వంటి సుదూర ప్రాంతాలకు అధిక సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఇప్పటికే ఎండలు మండుతున్న దృష్ట్యా షెల్టర్ లేక ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న వేసవి దృష్ట్యా బస్సు షెల్టర్ నిర్మించి మంచి నీటి సౌకర్యం, సూచికల బోర్డు ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు, ప్రభుత్వ అధికారులు ,ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సమస్యలు పరిష్కరిచాలి

వేసవికాలం ప్రారంభంలోనే ఎండలు దంచికొడుతున్నాయి. ముఖ్యంగా సింగరేణి ప్రాంతం కాబట్టి ఇతర ప్రాంతాలతో పోలిస్తే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ బస్సు స్టాప్‌లో బస్సు షెల్టర్ నిర్మించి మా సమస్యలు పరిష్కరించాలి.

- మణిమాల, శంకరమ్మ, కొత్తూరు రవీందర్, ప్రయాణీకులు

చలో విద్యుత్ సౌదా కార్యక్రమం విజయవంతం చేయాలి

- తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జిల్లా కన్వీనర్ మోత్కూరి కోటి

నవతెలంగాణ-రేగొండ

ఫిబ్రవరి 20న జరిగేచలో విద్యుత్ సౌదా కార్యక్రమం జయప్రదం చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జిల్లా కన్వీనర్ మోత్కూరి కోటి కోరారు. ఆదివారం రేగొండ మండలం లోని రేపాక గ్రామంలో చలో విద్యుత్ సౌదా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మోత్కూరి కోటి మాట్లాడుతూ విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ చేయాలని విద్యార్హతను బట్టి ఐటీఐ చేసిన వారికి జేఎల్ఎం, డిగ్రీ చేసిన వారికి జూనియర్ అసిస్టెంట్,టెన్త్ క్లాస్ చదివిన వారికి ఆఫీస్ సబార్డినేట్, డిప్లమో చేసిన వారికి సబ్ ఇంజినీర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన కన్వర్షన్ చేస్తామన్న హామీని నిలబెట్టుకోలేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు దాటినా కార్మికుల సమస్యలు తీర్చలేదన్నారు. ఆర్టిజన్ కన్వర్షన్ సాధనలో భాగంగా ఎస్పీడీసీఎల్ ఎన్పీడీసీఎల్ ఆఫీసుల వద్ద ధర్నా చేసి సుమారు ఐదు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేశామని వినతి పత్రాలు ఇచ్చామని అన్నారు. అయినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఈనెల 20న చలో విద్యుత్ సౌధ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో జెన్కో సిఎండీకి మెమోరాండం ఇస్తామని అన్నారు. అయినా సమస్యను పరిష్కరించకుంటే భవిష్య త్తులో మెరుపు సమ్మెకైనా సిద్ధమని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం మేనేజ్మెంట్ స్పందించి చర్చలకు పిలిచి ఆర్టిజన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్. అంకుషావాలి, సురేందర్‌రెడ్డి మచ్చిక వెంకటేశ్వర్లు, బత్తుల రాజేందర్, జేఎల్ఎం శ్యామ్ వేణు, అన్మ్యాన్ శ్రీనివాస్ రంజిత్, దేవేందర్, రైతు సంఘం నాయకులు బిక్ష పతి, రాజేందర్, సమ్మ య్య, కుమార్ పాల్గొన్నారు.



అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

ఎస్ఐ అచ్చ కమలాకర్



నవతెలంగాణ-గోవిందరావుపేట

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పస్రా ఎస్సై ఏ కమలాకర్ హెచ్చరించారు. ఆదివారం పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో తన సి బ్బందితో కలిసి ఇసుక లారీలను తనిఖీ చేశారు. ఇసుక లారీల యజమానులు డీడీలు లేకుండా తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని తెలి పారు. క్వారీల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు, పాటించాలని సూచించారు. ఒక లారీకి బదులు మరొక దానిలో ఇసుకను తరలించినా, ఓవర్ లోడ్ ఉన్న, జెసిబి లోడింగ్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినా కఠిన చర్యలు ఉంటా యని ఎస్సై హెచ్చరించారు.



పైడాకుల అశోక్ ఆర్థికసాయం

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఈక సారక్క కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదివారం పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ సారక్క మృతి బాధాకరమని, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని అన్నారు. అనంతరం సారక్క చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కర్లపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షునిగా ఉన్న సారక్క భర్త ఈక అప్పయ్యను పరామర్శించి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పాలడుగు వెంకటకృష్ణ, జిల్లా కార్మికశాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు దాసరి సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింత క్రాంతి, ఈక జగ్గారావు, పెండెకట్ల బాలరాజు, పసర గ్రామ యూత్ అధ్యక్షులు కొల్లు శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పయ్య కుటుంబానికి అండగా కాంగ్రెస్

నవతెలంగాణ-గోవిందరావుపేట

కర్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈక అప్పయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ అన్నారు. ఆదివారం కర్లపల్లి గ్రామంలోఈక అప్పయ్య సతీమణి ఈక సారక్క అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుం బానికి పదివేల ఆర్థికసహాయం అందించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ కష్ట కాలంలో ఉన్న ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ ఆదుకుంటుందని అన్నారు. కార్యకర్తల కష్టాల్లో నిరంతరం పాలుపంచుకుంటూ పార్టీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెట్టి సోమయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్, సహకార సంఘం అధ్యక్షులు పన్నాల ఎల్లారెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింత క్రాంతి, ఈక జగ్గారావు, పెండెకట్ల బాలరాజు, పంగ శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

నవతెలంగాణ-గోవిందరావుపేట

1995-96 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన మండల విద్యార్థులు ఆదివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడో సెటిల్ అయిన వారందరూ నేడు ఒకే వేదిక మీద కలుసుకోవడం కష్టసుఖాలను జీవిత అనుభవాలను నెమరు వేసుకోవడం జీవిత కాలం గుర్తుండే తీపి గుర్తుగా మిగిలిందని విద్యార్థులు అన్నారు. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇన్ని సంవత్సరాల తర్వాత ఒకే వేదిక పైకి రావడం కుటుంబము పిల్లలు ఆర్థిక స్థితిగతులు అన్ని ఒకరు ఒకరు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు.



నూతన వధువరులకు మాజీ జడ్పీటీసీ ఆశీర్వాదాలు..

నవతెలంగాణ-లింగాలఘనపురం



జిల్లా కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ నందు, మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన ముత్తినేని ఉపేందర్ రెండవ కుమారుడు యశ్వంత్ వివాహ మహోత్సవానికి ఆదివారం మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడి వంశీధర్‌రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటుగా మండల పార్టీ అధ్యక్షులు జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి శివకుమార్ , పార్టీ సీనియర్ నాయకులు బొల్లంపల్లి నాగేందర్ , జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు లోకట్ల ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీలం మోహన్, మాజీ ఎంపీపీ బోయిని రాజు, జిల్లా కార్యదర్శి దామెర నాగరాజు, మాజీ ఎంపీటీసీ ఉప్పల మధు, బుసిగంపల ఆంజనేయులు, దేవరాయ రాజు తదితరులు పాల్గొన్నారు..

దుండగులను కఠినంగా శిక్షించాలి

● ఎంపీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జట్టి రవికుమార్

నవతెలంగాణ-జఫర్‌గడ్



దళిత యువకుడి చేతులు నరికిన దుండగులను కఠినంగా శిక్షించాలని, జాతీయ ఎస్సీ కమీషన్ వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని సందర్శించాలని, ఎంపీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు జట్టి రవికుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని శివగంగా జిల్లా మానామదురై డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి అయ్యస్వామి మా ముందు బుల్లెట్ బండి నడుపుతాడా అంటూ జీర్ణించుకోలేక చేతులు నరికిన ఆదిపత్య కులాల తోటి విద్యార్థులు వినోద్, ఆదితఈశ్వరం, వల్లారాస్‌లను అత్యంత కఠినంగా శిక్షించాలన్నారు. జాతీయ ఎస్సీ కమీషన్ వెంటనే స్పందించి భాదిత కుటుంబాన్ని సందర్శించాలని, ఇలాంటి పిరికి చర్యలకు పాల్పడ్డ వారిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ప్రకారం కఠినంగా శిక్షించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను మహాజన ప్రజా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జట్టి రవికుమార్ డిమాండ్ చేశారు.



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య

నవతెలంగాణ-మరిపెడ

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, విద్యా, ఉద్యోగాల్లో ఉన్న విధంగా రిజర్వేషన్లు ఎబీసీడీ వర్గీకరణ చేసి అన్ని తరగతుల వారికి అవకాశం కల్పించాలని సీపీఐ(ఎం) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య, మరిపెడ మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మరిపెడ మండలం గుండెపూడి గ్రామంలో సీపీఐ(ఎం) శాఖ సమావేశం అల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో అలువాల వీరయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, శాసనసభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలు ప్రకటించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమగ్ర కుల గణన చేపట్టిందని, దీని ఆధారంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, సేవా సంచార అల్ప సంఖ్యాక వృత్తిదారులు 100కు పైగా ఆయా తరగతుల ప్రజలు, వార్డు మెంబర్, సర్పంచ్, కార్పొరేటర్, కౌన్సిలర్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్ ప్రయోజనం పొందలేకపోతున్నారన్నారు. అనేక సంవత్సరాలుగా స్థానిక బీసీ రిజర్వేషన్లు వర్గీకరణ చేయాలని తరగతుల ప్రజలు డిమాండ్ చేసినా పరిష్కరించకుండానే ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. ఈసారి ఎన్నికల్లోనైనా వర్గీకరణ చేసి అందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సీపీఐ(ఎం) మరిపెడ మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, మండల నాయకులు బాణాల రాజన్న, కందాల రమేష్, బోడపట్ల రాజశేఖర్, శాఖ కార్యదర్శి షేక్ షరీఫ్, గ్రామ నాయకులు యామిని నారాయణ, వడ్డకొండ ఉప్పలయ్య, బయ్య సురేష్, బింగి మహేష్ గంధసిరి మహేష్, బయ్య ప్రమీల, కందాల విజయ, గంధసిరి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు వైద్యం పట్ల అవగాహన కలిగి ఉండాలి

● మాజీ సైనిక వైద్యాధికారి డాక్టర్ కల్నన్ భిక్షపతి

● చెన్నూరులో.. ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-పాలకుర్తి

గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని మాజీ సైనిక వైద్యాధికారి డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. జనగామ, చెన్నూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం మండలంలోని చెన్నూరులో ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కల్నన్ భిక్షపతి మాట్లాడుతూ తాను పుట్టిన గడ్డకు సేవ చేయాలనే లక్ష్యంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ తరహాలో ఉచిత వైద్య సేవలు అందించి ఈ గడ్డ రుణం తీర్చుకోవాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని, గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, వైద్య చికిత్సలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. వైద్యం పట్ల ప్రజలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా వైద్యులను సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. దృష్టిలోపంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దంతాల సమస్యలపై వైద్యులతో సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఉచిత మెగా ఆరోగ్య వైద్య శిబిరంలో సుమారు రూ.50 లక్షల విలువ చేసే ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందించామని తెలిపారు. అజార హాస్పిటల్ హనుమకొండ, లెనోవా హాస్పటల్ హైదరాబాద్, ఆయుష్మాన్ జనగామ ఆస్పత్రుల నుండి 15 మంది వైద్యులు, 50 మంది వైద్య సిబ్బంది పాల్గొని 300 మంది గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని తెలిపారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గౌతమ్‌రెడ్డి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ గౌతమి, డాక్టర్ నీరజ, డాక్టర్ షఫీ, డాక్టర్ సృజన్, డాక్టర్ సతీష్, డాక్టర్ మమత, డాక్టర్ వరుణ్, డాక్టర్ అనిల్, క్యాంపు కో-ఆర్డినేటర్ సిద్ధి రజేందర్, లయన్స్ క్లబ్ బాధ్యతలు బజ్జూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సంతాజి ఎంపిక

నవతెలంగాణ-ఎల్కతుర్తి



ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుక్కిన సంతాజిని ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు శెట్టిపల్లి శివాజీ తెలిపారు. ఆదివారం మండలంలోని దామర గ్రామంలో శివాజీ విగ్రహావిష్కరణలో శెట్టిపల్లి శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరె కులానికి చింతలపల్లి గ్రామానికి చెందిన సుఖిన సంతాజీ చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తించి, ఆయన సేవలు రాష్ట్రానికి అవసరమని తెలిపారు. సంతాజి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు అధ్యక్షులు శివాజీకి, గౌరవ అధ్యక్షులు నాగూర్ల వెంకన్న, ఉపాధ్యక్షులు జెండా రాజేష్, సోమిడి అంజన్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆరెకుల సంక్షేమానికి కృషి చేస్తానని, ఓబిసి తెచ్చేందుగాను తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. సంతాజీ ఎంపిక పట్ల మండల ఆరెకుల సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేశారు.

బ్రిడ్జి నిర్మాణంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి

● 24వ రోజుకు చేరిన దీక్షలు

నవతెలంగాణ-జనగామ



బాణాపురం బైపాస్ రోడ్డు పై అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు విషయంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఇర్రి అహల్య కోరారు. జనగామ పట్టణంలోని హైదరాబాద్ ఎన్‌హెచ్ బైపాస్ రోడ్డు మీద అండర్‌పాస్ బ్రిడ్జిని తప్పనిసరి వెంటనే నిర్మించాలని సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహా దీక్షలు ఆదివారం 24వ రోజు ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య దండ వేసి నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈదీక్షలో సీపీఐ(ఎం) జనగాం పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ళ కళ్యాణి, శాఖ కార్యదర్శి ఎండీ.గౌసియా, ఎండీ.నాజియా, కొలిపాక వెంకటలక్ష్మి చింతల బాబు, సంఘ భక్తుల కోటయ్య బూడిది మానస, పార్నంది మల్లమ్మ తదితరులు కూర్చున్నారు. ఈసందర్భంగా అహల్య మాట్లాడుతూ ఈన్యాయమైన దీక్షలకు ఐద్వా మహిళా సంఘం నుండి జిల్లా వ్యాప్తంగా పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఇక్కడ మొత్తం మహిళలు ఉదయం లేచి మున్సిపల్‌లో, హోటళ్లలోపని చేసుకుని రాత్రి పూట ఇంటికి తిరిగి ఈదారి గుండా కాలినడకన వస్తుంటారని తెలిపారు. ఇక్కడ ఉండే ప్రజలు అధిక శాతం దళితులు, మైనార్టీలు, మహిళలు రోజువారిగా పని చేసుకుంటూ జీవనం కొనసాగే వారు పనికి వెళ్తూ వస్తున్న సమయంలో అనేకమైన ప్రమాదాలకు గురికాకుండా ఉండడం కోసం అండర్‌పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్నారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేయకపోతే వీరందరికీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ దృష్టిలో పెట్టుకొని నిర్మాణం చేపట్టాలన్నారు. ఇక్కడ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం అన్ని పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రజలవిజ్ఞప్తిని గుర్తించుకొని ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని ఆశతో ఉన్నామని తెలిపారు.

ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో.. మోర్తాల దీపక్





నవతెలంగాణ-జనగామ

ఇటీవల నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్వకేషన్ రికార్డ్ హోల్డర్స్‌లో భాగంగా జనగామ పట్టణానికి చెందిన మోర్తాల ప్రభాకర్ కుమారుడు మోర్తాల దీపక్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు సాధించారు. ప్రపంచంలో అత్యంత ఎత్తైన వాహన రహదారి ఉమ్లింగ్ లా పాస్ (19024 అడుగుల ఎత్తు), కార్దుంగ్ లా పాస్ (17982 అడుగుల ఎత్తు) (లడక్)లను ద్విచక్ర వాహనంతో అధిరోహించి చరిత్ర సృష్టించాడు మోర్తాల దీపక్. ప్రస్తుతం జనగామ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో రేడియో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఇతను దేశంలో బెస్ట్ మోటార్ సైకిల్ సాహస యాత్రికుడిగా పేరు సాధించాలనేదే తన లక్ష్యంగా పేర్కొన్నాడు. ఈఘనత సాధించిన మోర్తాల దీపక్‌ని జిల్లా వాసులు, కుటుంబ సభ్యులు, స్నేహితులందరూ హర్షం వ్యక్తం చేశారు.

బస్సును ఢీ కొట్టిన లారీ..







● బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురికి గాయాలు

● ఆర్ఆర్ పాన్ షాపు లోకి దూసుకెళ్లిన లారీ

● పోలీసుల ముందు చూపుతో తప్పిన ప్రాణ నష్టం

● రాజీవ్ చౌరస్తాలో ఘటన

● ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-పాలకుర్తి

ఆర్టీసీ బస్సును సిమెంటు లోడ్‌తో వెళుతున్న లారీ పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న కండక్టర్‌తో సహా ఏడుగురికి గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం 7:30 గంటలకు రాజీవ్ చౌరస్తాలో చోటు చేసుకుంది. ఎస్సై దూలం పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు నుండి హైదరాబాద్‌కు వెళుతున్న ఏపీ 36 జడ్ 0240 ఆర్టీసీ బస్సును నల్లగొండ నుండి వరంగల్‌కు సిమెంట్ లోడ్‌తో వెళుతున్న టీఎస్ 05 యూసీ 2969 నెంబరు గల లారీ ఆర్టీసీ బస్సును మధ్యలో ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న కండక్టర్ శ్రీరాముల స్వప్నతో పాటు వావిలాల గ్రామానికి చెందిన అనపర్తి చిలకమ్మ అనపర్తి వెంకటయ్య, నారబోయిన యాకమ్మ అనపర్తి సోమయ్య, రేగుల గ్రామానికి చెందిన బొలోజు నాగరాణి, దుంపల గౌరమ్మ, నాకి సోమయ్యలకు గాయాలయ్యాయని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పాలకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించామని, అనంతరం మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ బ్రేకులు ఫేయిల్ అవడంతో అదుపుతప్పి చౌరస్తాలో గల ఆర్ఆర్‌పాన్ షాపులో దూసుకెళ్లిందని తెలిపారు. పాన్ షాప్ ముందున్న ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయిందని, పాన్ షాప్ ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయిందని, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. లారీ ఒక్కసారిగా పాన్ షాప్ వైపు దూసుకు రావడంతో అప్రమత్తమైన పాన్ షాప్ యజమాని ప్రమాదం నుండి తప్పించుకునేందుకు బయటకు పరుగులు తీసి ప్రాణాలను రక్షించుకున్నాడని తెలిపారు. రాజీవ్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహన దారులు అతి వేగంగా వాహనాలు నడుపుతున్నారని తెలిపారు. గతంలో చౌరస్తాలో అనేక ప్రమాదాలు జరిగాయని వివరించారు. నిత్యం ప్రజలతో, బస్సులతో, ప్రైవేటు వాహనాలతో రాజీవ్ చౌరస్తా రద్దీగా ఉండడంతో తరచుగా ప్రమాదాలు జరిగే వన్నారు. ప్రమాదాలను నివారించేందుకు బస్టాండ్‌ను పునరుద్ధరించి బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలని, ప్రయాణికులకు సకల సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. అప్రమత్తమైన పోలీసులు రాజీవ్ చౌరస్తాలో వాహనాలు పార్కింగ్ చేయకూడదని, బస్సులు ఆపకూడదని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశాలంగా ఉన్న రోడ్డు ఇరుకుగా మారడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాలను నివారించాలన్న పోలీసుల ముందు చూపుతో బస్సును లారీ ఢీ కొట్టిన సంఘటనలో భారీ ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు తెలిపారు. గత మూడు రోజులుగా ఆర్ఆర్ పాన్ షాప్ సమీపంలో చిరు వ్యాపారం చేసుకుంటున్న పండ్ల బండితో పాటు మిర్చి బండిని ఖాళీ చేయించడం పోలీసులు వారికి ప్రాణ భిక్ష పెట్టినట్లు అయిందని తెలిపారు. సీఐ గట్ల మహేందర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఎస్సైలు దూలం పవన్‌కుమార్, లింగారెడ్డిలు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. రాజీవ్ చౌరస్తాలో ప్రయాణికుల రద్దీ లేకుండా చేయడం వల్లనే ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం పట్ల స్థానికులు పోలీసులను అభినందించారు. పోలీసులు తీసుకున్న ముందస్తు చర్యలే ఈరోజు జరిగిన ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగిందని అభిప్రాయపడ్డారు. పూర్తి స్థాయి ప్రమాదాలను నివారించేందుకు పుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారస్తులను ఖాళీ చేయించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. నిత్యం రాజీవ్ చౌరస్తా పోలీసుల పర్యవేక్షణలో ఉండటం వల్లనే ప్రమాదాలతో ప్రాణ నష్టం జరగకుండా నివారిస్తున్నారు. విశాలంగా ఉన్న రోడ్డుపై అతివేగంగా వెళ్లే వాహనాలను నివారించేందుకు రాజీవ్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు పంచాయతీరాజ్ శాఖ అధికారులను కోరారు. స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డిని కోరుతామని తెలిపారు. పాలకుర్తి రాజీవ్ చౌరస్తా ప్రయాణికులతో రద్దీగా ఉండటాన్ని స్వయంగా గమనించిన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి వాహనాలన్నీ బస్టాండ్‌కు వెళ్లాలని అధికారులను ఆదేశించడంతో ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి ఆదేశాలు ప్రమాదాల్లో ప్రాణ నష్టం జరగకుండా దోహద పడిందని తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్ఆర్ పాన్ షాపులో దూసుకెళ్లిన లారీని బయటకు తీసేందుకు జేసీబీల సహాయంతో పోలీసులు రెండు గంటల పాటు శ్రమించారు. బస్సు, లారీ ఢీ సంఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నవతెలంగాణ-వరంగల్

తెలంగాణలో తొలిసారి చేపట్టిన కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) లో ఎవరైతే వివిధ కారణాలచే నమోదు చేసుకో లేదో అటు వంటి వారి కోసం మరోసారి నిర్వహిస్తున్న సర్వే ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు.ఆదివారం వరంగల్ పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయం, కరీమాబాద్ మీ సేవా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి ఆయా కేంద్రాల్లో రిసర్వే లో నమోదు వివరాల తీరును, రిజిస్టర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 28 వరకు సర్వేను నిర్వ హిస్తారని తెలిపారు.ఇప్పటి వరకు కుల గణనలో నమోదు కాని కుటుంబ సభ్యులు మాత్రమే సర్వే లో నమోదు చేసుకొనుటకు ప్రభుత్వం తిరిగి అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు వినియోగించుకోవడానికి వరంగల్ నగర వ్యాప్తంగా 3ప్రజా పాలన సేవా కేంద్రాలైన పోచమ్మ మైదాన్ ఈ-సేవా కేంద్రం, కాశీ బుగ్గ సర్కిల్ ఆఫీస్ కేంద్రం, కరీమాబాద్ ఈ సేవా కేంద్రాలలో, నర్సంపేట తహసీల్ కార్యాలయంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్ర మంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, బల్దియా రెవిన్యూ అధికారి షాజాదిబేగం, పర్యవేక్షకులు హబీబుద్దిన్, ఆర్ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రక్తదానం చేసి ప్రాణదాతలు కండి..

నవతెలంగాణ-జనగామ

నేడు జనగామలో నిర్వహించు రక్తదాన శిబిరంలో రక్తదానం చేసి ప్రమాదాలు, వేరే కారణాల వల్ల రక్తస్రావం జరిగినా, మరేరకంగానో రక్త లేమి వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడి ప్రాణదాతలు కావాలనిలయన్స్ క్లబ్ ఆబాద్ పూర్వ రీజియన్ చైర్మన్, రక్తదాన శిబిరం కో-ఆర్డినేటర్ లయన్ కదిరె రాజశేఖర్ రెడ్డి అన్నారు. నేడు (సోమవారం) ఉదయం మాజీ ముఖ్య మంత్రి కె.చంద్రశేఖర్ రావు జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ సౌజన్యం, స్థానిక రక్తనిధి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంట లకు ఎమ్మెల్యే లయన్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించే ఈశిబిరంలో పూర్వ జిల్లా గవర్నర్లు డాక్టర్ డి. లవకుమార్ రెడ్డి, కన్న పరశురాములు, రీజియన్ చైర్మన్ కలువల భాస్కర్ రెడ్డి, జోన్ చైర్మన్ శ్రీభాష్యం రఘు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే రక్త దాతలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ పి.నాగేశ్వర్‌రావు కోరారు.

జనగామ పట్టణంలో.. కారు హల్చల్..

● ఐదుగురికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జనగామ

జనగామ పట్టణంలోని సూర్యాపేటలో రోడ్డులో అధిక స్పీడ్‌తో అదుపుతప్పి ద్విచక్ర వాహనాలు, ప్రజలపై దూసుకెళ్లింది. దీంతో అక్కడే ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సూర్యాపేట రోడ్డులో గల బజాజ్ షోరూం వద్ద ఆర్టీసీ చౌరస్తా నుండి అతివేగంగా వచ్చిన కారు ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న వాహనాలతో పాటు ప్రజలపై దూసుకెళ్లింది. దీంతో రోడ్డు పక్కన ఉన్న మహిళతో పాటు మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ కుమార్ తెలిపారు.

హమాలీ కార్మికుల రాష్ట్ర 3వ మహాసభను జయప్రదం చేయండి

ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి

నవతెలంగాణ-తొర్రూర్



దేశవ్యాప్తంగా వివిధ వస్తువులను ఎగుమతులు, దిగుమతులు చేస్తూ ప్రజల అవసరాలు తీర్చుతున్న హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమైనారని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి, తెలంగాణ ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాం పుల్లయ్యలు అన్నారు. ఫిబ్రవరి 21న ఖమ్మం పట్టణంలో జరుగు తెలంగాణ ప్రగతిశీల హమాలీ వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆదివారం తొర్రూర్‌లో రిక్షా హమాలీ వర్కర్స్‌తో సమావేశం నిర్వహించి మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ అధ్యక్షులు మంగళపెల్లి సాయిలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ హమాలీలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి వారందరిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. .ఫిబ్రవరి 21న ఖమ్మం పట్టణంలోని చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన కేంద్రంలో జరుగు రాష్ట్ర 3వ మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి కార్మిక ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈమహాసభలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అనేక ఉద్యమాలకు, పోరాటాలకు రూపకల్పన చేయనున్నామన్నారు. హమాలీ కార్మికులు ఈమహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు యాకయ్య, కార్యవర్గ సభ్యులు లక్ష్మయ్య, చంద్రయ్య, శ్రీనివాస్, విజయ్, సోమయ్య, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు గుర్తింపు

హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్‌గా గొర్రె మహేందర్



నవతెలంగాణ-ఎల్కతుర్తి

మండలంలోని దామర గ్రామానికి చెందిన మహేందర్ హనుమకొండ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ నియామకమయ్యారు. ఆదివారం టిపిసిసి రాష్ట్ర ఎస్సీ చైర్మన్ నాగరి ప్రీతం చేతుల మీదుగా ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గొర్రె మహేందర్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందంటే కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు.పార్టీ పటిష్టతకుక అహర్నిశలు కృషి చేస్తాననితెలిపారు. ఆయన ఎంపిక పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు మేడారంలో ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -తాడ్వాయి





మండలంలోని మేడారంలో నేడు(సోమవారం) తెలంగాణ మొట్టమొదటి సీఎం, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు మేడారంలోని వనదేవతల సన్నిధిలో ఘనంగా నిర్వహిం చనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దండగల మల్లయ్య, కార్యదర్శి పోకు నాగేష్‌లు వేర్వేరుగా ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు(సోమవారం) మండలంలోని బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఆత్మ చైర్మన్, మాజీ జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు అభిమానులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ కలయిక..



నవతెలంగాణ-కురవి

1971-1972 పదవతరగతి బ్యాచ్ పూర్వ విద్యా ర్థులు బలపాల జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహి ంచారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నామా సైదులు, రావూరి ప్రభాకర్‌రావు, అంబాటి వెంకటనారాయణలు జ్యోతి ప్రజ్వలన చేసి మరణించిన పూర్వ విద్యార్థులకు ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో కిలారి అశోక్ బాబు, చింతల మోహన్‌రావు, చిక్క వెంకటేశ్వర్లు, తాటికొండ మల్లారెడ్డి, రావూరి విమల, దార నరసింహారావు, రావూరి రమేష్, ఈడిగిరాం ఐలయ్య, బొల్ల వసంత, గరిక వెంకటేశ్వర్లు, కె.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని మాట్లాడడం విడ్డూరం



నవతెలంగాణ-బయ్యారం:

విభజన చట్టంలో హామీ ఇచ్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు సాధ్యం కాదని తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నంబూరి మధు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చట్టబద్ధంగా ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, తెలంగాణకు చట్టబద్ధంగా రావాల్సిన బయ్యారం ఉక్కు పరిశ్రమ కోసం కొట్లాడి సాధించాల్సిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పరిశ్రమ సాధ్యం కాదని మాట్లాడడం సిగ్గు చేటన్నారు. ముడి ఖనిజం క్వాలిటీ లేనందున ఉక్కు పరిశ్రమ పెట్టడం లేదనేది సాకు మాత్రమేనని, అసలు ఖనిజమే లేని విశాఖ స్టీల్స్ 500 కి.మీ దూరం నుండి ఖనిజాన్ని, బొగ్గును, డోలమైట్‌ను తెచ్చుకొంటూ లాభాలు గడిస్తుంటే అన్ని వనరులున్న బయ్యారంలో సాధ్యం కాదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కిషన్‌రెడ్డి తన మాటలను వెనక్కు తీసుకొని కేంద్రాన్ని ఒప్పించి బయ్యారం ఉక్కు పరిశ్రమను తీసుకు రావాలని, తెలంగాణ ప్రజల హక్కును హరించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు.



కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటండి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత

నవతెలంగాణ-మహబూబాబాద్

కేసీఆర్ పుట్టినరోజు ఫిబ్రవరి 17 సందర్భంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు ఒక్కొక్కరు మూడు మొక్కలు నాటి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత కోరారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టి కర్త జోగినపల్లి సంతోష్ కుమార్ పిలుపుమేరకు మొక్కలు నాటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ఆదివారం కవిత మొక్కలు నాటి పిలుపునిచ్చారు. ఈమహోన్నత కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త పాల్గొనాలన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముత్యం వెంకన్న గౌడ్, మహబూబ్ పాషా, ఎండీ.సలీం, అసిఫ్ అలీ జానీ, పొన్నాల యుగేంధర్, మానాది రాజేష్ బానోతు రామునాయక్ బండమీద సంపత్, జెశ్వంత్ గౌడ్ ప్రశాంత్, అమీర్, ఉదయ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నరసింహస్వామి

నవతెలంగాణ-మహబూబాబాద్



పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నరసింహ స్వామి కోరారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ శిక్షణ తరగతులను మహబూబాబాద్ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ ఆడిటోరియంలో ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా నరసింహస్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ అన్ని వసతి గృహాలలో అత్యాధునిక వసతులు, సౌకర్యాలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని, విద్యార్థిని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు, చదువుకున్న విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచిచారు. జిల్లా విద్యాశాఖాధికారి సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లో సబ్జెక్టు వారీగా అరెంజ్ చేయడం జరిగిందని, ఇందులో భాగంగా సోషల్ సన్స్‌కు ఓం ప్రకాష్ టీచర్, మ్యాస్ కొరకు సదయ్య టీచర్, సోషల్ కొరకు వార్త అశోక్ టీచర్, అలాగే హిందీ కొరకు శ్రీధర్ టీచర్, ఇంగ్లీష్ కొరకు సత్యనారాయణ టీచర్, బయోసైన్స్ కొరకు రామ్మోహన్, తెలుగు కొరకు సురేష్, టీచర్‌లను అరెంజ్ చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారులు యాలాద్రి, వీరన్న, ఎల్లస్వామి, శ్రీలత, రజిని, ధనలక్ష్మి, వెంకన్న, హిమబిందు, పూర్ణచందర్, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

- హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ
- విజేతలైన క్రీడాకారులకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-తొర్రూరు/తొర్రూర్‌రూరల్:



యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్ర వరంగల్ వారి అధ్వర్యంలో నిర్వహించబడిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు స్థానిక హైస్కూల్‌లో ఆదివారం బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి గ్రామీణ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు గెలుపోటములను సమదృష్టితో చూడాలన్నారు. అనంతరం నవయుగ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు, క్రీడల నిర్వాహకలు బానోతు వీరన్న నాయక్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక, శారీరక ధృఢత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. క్రీడల వలన జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. బాలబాలికలు క్రీడల్లో రాణించడానికి నెహ్రూ యువ కేంద్రం మంచి అవకాశాలు కల్పిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. బాలికల కబడ్డీ విభాగంలో మొదటి బహుమతి మరిపెడ ఆర్‌జేఆర్ఎం డిగ్రీ కళాశాల బాలికలు కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతి చిన్న గూడూరు గ్రామ బాలికలు గెలుచుకున్నారు. బాలుర వాలీబాల్ విభాగంలో మొదటి బహుమతి మహబూబాబాద్ విద్యార్థులు, ద్వితీయ బహుమతి వెలికట్ట విద్యార్థులు గెలుచుకున్నారు. 200 మీటర్ల పరుగు పందెం బాలికల విభాగంలో జె.నిఖిత, ద్వితీయ ఎస్.బబ్లీ, బాలుర విభాగంలో ఇ.సిద్దు, ద్వితీయ బహుమతి జి.రాజేష్, బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో బి.వివేక్ ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. ఈకార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ తొర్రూర్ ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, మల్లయ్య, శివ, భాస్కర్,నర్మదా తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ ను జయప్రదం చేయండి.



నవతెలంగాణ-కొత్తగూడ

మండల కేంద్రంలోని న్యూడెమోక్రసీ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ చేశారు.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో నిర్వహించే భారీ నిరసన ప్రదర్శన, సభకు ప్రజలు భారీ ఎత్తున కదిలి జయప్రదం చేయాలని కొత్తగూడ సబ్ డివిజన్ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదలందరికీ పక్కా గృహాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, వైద్య సమస్య పరిష్కరించి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న పోడు భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యాదగిరి, యుగంధర్, పసునూరి రాజమల్లు, దేవులపల్లి మంగన్న, భూక్య పూర్ణచందర్, మద్దెల వెంకటేష్, ఈసం రామస్వామి, ఈసం సారయ్య, మద్దెల విజయ, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ బోధనలు నేటి సమాజానికి ఆదర్శం..

- ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్



నవతెలంగాణ-మహబూబాబాద్

సేవాలాల్ మహారాజ్ తాత్విక బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని, సేవాలాల్ సేవాగుణం, సత్యం, అహింస, ప్రేమతో ప్రతి ఒక్కరిని సమానంగా చూడాలని, లక్ష్యాల కోసం ప్రతిఒక్కరూ ధర్మాలను పాటించి సేవలాల్‌ని ఆదర్శంగా తీసుకోవాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు.. ఆదివారం మహబూబాద్ మండలంలోని ఇస్లావత్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని బిచ్య తండాలో భోగి బండారు కార్య క్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నైవేద్యాన్ని సమర్పించి పూజలు చేశారు. ఈసం దర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పూర్వ కాలంలో చెల్లచెదురైపోతున్న బంజారాలందరిని ఒకే ఆవాసాల కింద ఉండే విధంగా జాతిని సమీకృతం చేసిన గొప్ప తత్త్వవేత్త సేవలాల్ అని, సమాజంలో గిరిజనులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సేవాలాల్ బోధించిన సత్యం, అహింస వంటి అనుసరించిన బోధనలు నేటి సమాజానికి ఎంతో అవస రమన్నారు. లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ, సేవాలాల్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశంలో మాజీ సర్పంచ్ బోడ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఆంగోతు చందులాల్, మహమ్మద్ షకీల్ హమ్మద్, బానోతు రతీరామ్, బోడా హరిలాల్, బానోతు హరిసింగ్, బానోతు జహీందర్‌లు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో.. కార్మికుల ఆకలి కేకలు..

- ఎనిమిది నెలలుగా అందని వేతనాలు..
- కాంటిజెంట్ కార్మికుల కష్టాలు..

నవతెలంగాణ-మహబూబాబాద్

నాన్న నీవు కలెక్టరేట్‌లో పని చేస్తున్నావ్ ఇంకా వేతనం రాలేదా అని పిల్లలు అడుగుతుంటే ఆకార్మికులు కన్నీటిపర్యంతమవుతున్నారు. గత ఎనిమిది నెలలుగా వేతనాలు రాక కార్మికులు, పిల్లలు పస్తులు ఉంటున్నారు. పేరుకు పార్ట్ టైం కార్మికులు అయినప్పటికీ ఫుల్ టైం పని చేయవలసిన దుస్థితి దాపురించింది. పొద్దు పొడవక ముందే పనిలోకి వెళ్లి పొద్దుపోయిన తర్వాత ఇంటికి చేరుతారు. ఏ అధికారి ఎప్పుడు పిలుస్తాడో తెలియని భయం. కార్మికులు అందరూ చేసేది ఒకే పని అయినప్పటికీ వేతనాల్లో వ్యత్యాసం వారిని వెక్కిరిస్తుంది. ఇది మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కాంటిజెంట్ దినసరి వేతన కార్మికుల దుస్థితి. పూర్తి వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా ఏర్పడిన తరువాత 2016లో మానుకోటలో గిరిజన భవన్‌లో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. అప్పటి తొలి కలెక్టర్ ప్రీతి మీనా కలెక్టరేట్ కార్యాలయాన్ని ఊడ్చి శుభ్రం చేసి నీళ్లు పెట్టడం కోసం, పూల మొక్కలు నిర్వహణ కోసం కాంటిజెంట్ దినసరి వేతన కార్మికులను నియమించారు. 2016లో వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేల వేతనం ఇచ్చారు. ఉదయం 5 గంటలకు కలెక్టరేట్‌కు వచ్చి మొత్తం ప్రాంగణ చీపురుతో ఊడ్చి టేబుల్ తుడిచి కుర్చీలు, తలుపులు, కిటికీలు శుభ్రం చేసి ఫైల్స్ సర్ది శుభ్రం చేసి నీళ్లు పెట్టి మొక్కల నీళ్లు పెట్టి చెత్తాచెదారం ఎత్తివేసి 9, 10 గంటల వరకు ఇంటికి వెళ్లి వేరే పని చేసుకునేవారు. రెండు సంవత్సరాల తర్వాత వారి వేతనం రూ.8500 పెంచారు. మరో రెండు సంవత్సరాలకు రూ.10,400కు పెంచారు. ఏమైందో ఏమో కానీ 2021లో వారి వేతనాన్ని కోత విధించి రూ.9200కు తగ్గించారు. 2023లో పాత కలెక్టరేట్ భవనం కొత్త కలెక్టరేట్ భవనానికి మార్చారు. అప్పటినుంచి కాంటిజెంట్ కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. కార్మికులు సరిపోకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా మరి కొంతమందిని నియమించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియమించిన కార్మికులకు నెలకు ఒక్కొక్కరికి రూ.12,500 ఇస్తున్నారు. ఎప్పటికప్పుడు వేతనం వారి అకౌంట్‌లో పడిపోతుంది కాని పాత కలెక్టరేట్ నుంచి గత 9 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో ఎదుగు బొదుగుకు లేదు పని భారం పెరిగింది. గతంలో నాలుగు గంటలు మాత్రమే చేసే పని ఇప్పుడు ఆరేడుగంటలు పెరిగిపోయింది. కొత్త కలెక్టరేట్‌లో రెవెన్యూ పరిధిలో అన్ని కార్యాలయాలు వీళ్లే శుభ్రం చేస్తున్నారు. మధ్యాహ్నం పూట వీడియో కాన్ఫరెన్స్‌లు సమీక్షలు నిర్వహించడంతో ఆహాల్‌లో కూడా వీళ్లే పని చేయవలసి వస్తుంది. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అధికారులకు అవసరం వచ్చినప్పుడు పిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినా గత ఎనిమిది నెలలుగా వేతనాలు లేకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. 2023 జూన్ నుంచి వేతనాలు రావడం లేదు. భవిష్యత్తులో కూడా ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండడంతో ఆ కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వేతనాల కోసం అక్కడి అధికారులను వేడుకోగా బడ్జెట్ లేదంటున్నారు. సాక్షాత్తు జిల్లా అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్న కలెక్టరేట్‌లో కార్మికుల పరిస్థితి ఇలా ఉండడం వారిని తీవ్ర మనోవేదనకు గురిచేస్తుంది. తమ బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక చెప్పుకుంటే ఏమవుతుందోననే భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తమకు వేతనాలు ఇవ్వాలని, తమ బతుకులకు దారి చూపి పర్మినెంట్ చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు.

తాగునీరు అందించండి

- పట్టణ ప్రజల వినతి
- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్ చేస్తున్న అధికారులు
- పలుచోట్ల కాలువలు తవ్వి వదిలేశారు



నవతెలంగాణ-తొర్రూర్

తొర్రూరు మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో మంచినీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. వేసవికి ముందే ఈవిధంగా త్రాగునీటి సమస వస్తే ఎలా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి మున్సిపల్ పరిధిలోని మంచినీటి బావి, మిషన్ భగీరథ మంచినీటి సరఫరాను పరిశీలించి పట్టణ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ మంచినీటి సరఫరా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులు చేస్తున్న క్రమంలో ఇంటి నల్ల కనెక్షన్లు తొలగిపోతే తిరిగి కనెక్షన్లు ఇవ్వాల్సిన సిబ్బంది డబ్బులు ఇస్తేనే కనెక్షన్ పెడుతున్నారని, ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చేద్దాం.. చూద్దాం అన్న సమాధానాలు వినిపిస్తున్నాయని, పనులు మాత్రం త్వరితగతిన జరగడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. నెలల తరబడి తాగునీరు రాకుండా పోతే నిత్యకృత్యాలు ఎలా చేసుకోవాలని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 14వ వార్డు, ఏడవ వార్డు, ఇంకా వివిధ వార్డుల్లో తాగునీరు సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా పనులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల తీరుపై, జరుగుతున్న పనులపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి పట్టణ ప్రజలకు తాగునీరు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-మహబూబాబాద్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ పార్టీని భవిష్యత్తులో ఎవరూ కాపాడలేరని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హలావత్ లింగన్న స్పష్టం చేశారు. ఆదివారం మహబూబాబాద్ పట్టణంలోని సామ పూలక్క నగర్ బట్టు అంజయ్య నగర్ కాలనీలలో ఫిబ్రవరి 20న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగే ధర్నా ను విజయవంతం చేయాలని గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాల్సిందేనని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలలో దోషిగా నిలబడక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సామపాపయ్య, భట్టు చైతన్య ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి తెలబోయిన లక్ష్మయ్య, పట్టణ నాయకులు కుక్కమూడి యాకయ్య, కట్ల నాగరాజు, కుక్కమూడి అనిత, సోమన్న మలోతు శ్రీను, దేవేంద్ర, చిల్లా మౌనిక, షాబుద్దీన్, మహేష్, సుజాత, ప్రమీల, ఎల్లమ్మ, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అడ్డాగా ఫుట్‌పాత్‌లు..





- పట్టించుకోని అధికారులు
- రోడ్లపై నుంచే నడుచుకుంటూ వెళుతున్న పాదచారులు

నవతెలంగాణ-తొర్రూర్

ఖాళీబాటలు, రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఓవైపు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంటే మరోవైపు రహదారుల కబ్జా ఆందోళన కలిగిస్తుంది. హద్దులు లేకుండా, అడ్డు అదుపు లేకుండా టిఫిన్ సెంటర్లు, టీ కొట్టు, పాన్ డబ్బాలు, తోపుడు బండ్లు, పండ్ల బండ్లు, కూరగాయల దుకాణాలు రోడ్డు పొడవునా ఫుట్‌పాత్‌లపై పుట్టుకొస్తున్నాయి. వాటి వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు నిలుస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఫుట్‌పాత్‌లపై నడవాల్సిన ప్రజలు, పాదచారులు రోడ్డుపై నడుస్తుండడం వలన తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్, ఎన్‌ఫోర్స్‌మెంట్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులు ఆక్రమణలను తొలగించినా మళ్లీ సమస్య మొదటికీ వస్తుంది. ఆయా విభాగాల అధికారులు మొక్కుబడిగా తీసుకునే చర్యలే ఇందుకు కారణమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై ఉన్న తొర్రూర్ పట్టణం బస్టాండ్ సెంటర్ నుండి ఎటు రెండు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రహదారి పొడవునా ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు ఉన్నాయి. ప్రధానంగా బస్ డిపో నుండి బస్టాండ్ వరకు, బస్టాండ్ నుండి అశ్విని టాకీస్ వరకు, గాంధీ సెంటర్, కూరగాయల మార్కెట్, అన్నారం రోడ్డు, హరిపిరాల రోడ్డు, కంటాయిపాలెం రోడ్డులో అడుగడుగునా ఆక్రమణలు దర్శనమిస్తాయి. గత కొంత కాలంగా కొంతమంది కబ్జాదారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వాటిపై శాశ్వత నిర్మాణాలు చేపట్టి ఆ స్థలాలను అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. పెరిగిన వాహనాల రద్దీ కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి.



డివిజన్ కేంద్రమైన తొర్రూర్ పట్టణంలో రోజురోజుకు ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు, పాదచారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కంటితుడుపు చర్యలు కాకుండా సమస్య శాశ్వత పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

-సీపీఐ(ఎం) జిల్లా సభ్యులు, తొర్రూరు, బొల్లం అశోక్

పొట్టేల్‌కు ధర పెరిగింది..

- బర్డ్ ఫ్లూ తో తగ్గిన చికెన్ వినియోగం
- ఫంక్షన్ నిర్వాహకుల జేబులకు చిల్లు...



నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

పొట్టేల్‌కు ధర పెరిగింది బర్డ్ ఫ్లూతో చికెన్ ధర అమాంతం దిగిపోయింది. దీంతో వినియోగదారులు చికెన్ తినడం మానివేయడంతో మటన్(మాంసం) వినియోగం పెరిగింది. పెళ్లిళ్ల ఫంక్షన్లు చేసేవారు అధికమవడంతో మటన్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మటన్ కోసం పొట్టేల్‌ను తీసుకోవడంతో పొట్టేలు ధర అమాంతం పెరిగిపోయింది. బహిరంగ మార్కెట్‌లో పొట్టేల్ ధర రూ.10000 నుండి రూ.30000 ధర పలుకుతుంది. బర్డ్‌ఫ్లూతో ముక్కలేకుండా ముద్ద దిగదనే వారి జేబుకు చిల్లు పెరిగినా ఖర్చు- చికెన్‌ప్లేస్‌లో అధిక రేట్లతో మటన్, ఫిష్, పెళ్లిళ్ల ఫంక్షన్లు చేసే వారికి వెంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందట.. అలా ఉంది.. ఇప్పుడు బర్డ్‌ఫ్లూ వైరస్ శుభకార్యాలయాలపై ఎఫెక్ట్ పడుతోంది. మహూర్తాలు బాగున్నాయని పెళ్లిలు, ఇతర శుభకార్యక్రమాలు ఎక్కువ పెట్టుకున్నారు. జనాలు సడెన్‌గా బర్డ్‌ఫ్లూ రావడంతో దాని ఎఫెక్ట్ భోజనాలపై తీవ్రంగా పడిందని అంటున్నారు నిర్వాహకులు. ఇటీవల కాలంలో ప్రతి వేడుకకు ముక్కలేకుండా ముద్దదిగదని పరిస్థితి నెలకొంది. చాలామంది నాన్‌వెజ్ వంటకాలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కొందరు పెళ్లి వేడుక రోజున కేవలం వెజ్ వంటకాలు వడ్డిస్తున్నప్పటికీ ఆతరువాత జరిపే వేడుకలకు, రిసెప్షన్లకు మాంసాహార వంటకాలు తప్పనిసరి చేస్తున్నారు. బర్డ్‌ఫ్లూ పుణ్యమా అని నాన్‌వెజ్ వంటకాల్లో చికెన్ స్థానంలో మటన్ వచ్చి చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. బర్డ్‌ఫ్లూ వైరస్ వల్ల రూ.లక్షల్లో కోళ్లు మృత్యువాతపడడం, బర్డ్‌ఫ్లూ వైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కట్టడి చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం వైరస్ ప్రభావం లేదని చెబుతున్నా ప్రజల్లో భయం మాత్రం పోలేదు. ఈక్రమంలోనే చికెన్, కోడిగుడ్లు అమ్మకాలు పడిపోతున్నాయి. అంతేకాదు ఫంక్షన్ల మెనూ నుంచి చికెన్ ఐటెం తీసేసి దాని స్థానంలో మటన్ చేర్చుతున్నారు. దీంతో ఒక్కసారిగా ఖర్చు భారీగా పెరగడంతో లబోదిబో మంటున్నారు నిర్వాహకులు దీంతో రెట్టింపు ఖర్చు జేబుకు చిల్లు పెడుతోందని వాపోతున్నారు. రూ.1000 అయ్యే ఖర్చు చికెన్ ఐటెమ్‌లు తినక పోవడం వల్ల మటన్, ఫిష్ ఐటెమ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడంతో రూ.2000 పైనే బిల్లు చెల్లించాల్సి వస్తోంది. మొత్తం మీద ముక్కలేకుండా ముద్ద దిగని మాంసాహార ప్రియులు మాత్రం అదనపు ఖర్చు వల్ల మాత్రం కాస్త ఇబ్బందులు పడుతున్నారు.

మహా ధర్నాను విజయవంతం చేయండి

నవతెలంగాణ-తొర్రూరు

ఆరు గ్యారంటీల అమలుకై ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాకు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ దంతాలపల్లి ఎస్‌డీఎల్‌సీ కార్యదర్శి చిర్ర యకన్న పిలుపునిచ్చారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం నరసింహుల పేట మండల కేంద్రంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు. చిర్ర హనుమంతు, సిరి యాకన్న, కొమ్ము కుమార్, భూక్య వీరన్న, దేశగాని ఉప్పలయ్య, రామ్మూర్తి యోగేంధర్, తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్ బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలి

నవతెలంగాణ-మహబూబాబాద్:

పెన్షనర్స్ బెనిఫిట్స్ తక్షణమే విడుదల చేయాలని గిరిజన విద్యావంతుల సిండికేట్ వ్యవస్థాపక అధ్యక్షులు గుగులోతు కిషన్ నాయక్, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మైస నాగయ్య లు కోరారు. ఆదివారం మానుకోటలో ఆఫీసర్స్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు మార్చి 24 నుండి వివిధ శాఖల్లో పనిచేస్తూ రిటైర్మెంట్ అయిన ఉద్యోగస్తులకు 35 నుంచి 40 సంవత్సరాలు దాటినా డబ్బులు వారికి రాకపోవడం అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వాస్తవంగా రిటైర్డ్ అయిన రోజే వారు దాచుకున్న రూపాయలు గ్రాడ్యుటీ, జీపీఎఫ్ ఏపీజీఎల్ఈ, సరెండర్ లీవ్‌లు, మెడికల్ లీవ్‌లు, ఇతరత్రా బెనిఫిట్స్ రావాల్సి ఉండగా నేటికీ సంవత్సరం దాటుతున్న ఒక్క రూపాయి కూడా ప్రభుత్వ నుండి రాలేదన్నారు. ఈమార్చి బడ్జెట్‌లో రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు పెన్షనరీ బెనిఫిట్స్ తక్షణమే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహబూబాబాద్ నుండి సమరానికి సిద్ధమవుతున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, బతికున్నప్పుడు రాని డబ్బులు చనిపోయినాక, ఎవరికోసమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సోమయ్య, అంబటి వీరభద్రం ఆర్.వెంకటరెడ్డి, బాలాజీనాయక్, నారాయణ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.